ప్రజాశక్తి
గురువారం 1 ఆగస్టు 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

గుట్టుచప్పుడు కాకుండా..

స్మార్ట్‌మీటర్ల బిగింపు

- అడ్డుకున్న చోట ఉదయం ఐదు గంటలకు అమరిక
- టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక మరింత వేగవంతం
- ఆందోళనలో అనకాపల్లి జిల్లా రైతులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, మునగపాక విలేకరి

వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్ల బిగించడం ఆగలేదు. రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా, వ్యతి రేకిస్తున్నా పట్టించుకోవడం లేదు. రైతుల సమ్మతితో పనిలేకుండా వారికి తెలియ కుండానే మీటర్లు బిగించి వెళ్లిపోతున్నారు. రైతు తమ పొలాల్లోకి రాకముందే సిబ్బంది మీటర్లు అమర్చుతున్నారు. మీటర్ల బిగింపును ఎపి రైతు సంఘం, సిపిఎం అడ్డుకుంటున్న ప్రాంతాల్లో పగటి సమయంలో కాకుండా ఉదయం ఐదు గంటలకే బిగిస్తున్నారు. అనకాపల్లి జిల్లాలోని 24 మండలాల్లో వ్యవసాయ పంపుసెట్లు 30 వేలు వున్నాయి. ఇప్పటికి 15 వేల పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు అమర్చారు. పంపుసెట్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించిన టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఆపుతుందని రైతులు భావించారు. కానీ గతం కంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వేగవంతంగా సాగు తోంది. గత ప్రభుత్వం కాలంలో అమలైన పథకాల పేర్లను మార్చిన కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లపై ముద్రించిన వైఎస్ఆర్ ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం అని పేరును యథాతథంగా కొనసాగిస్తోంది. భవిష్యత్తులో వ్యవసాయ పంపుసెట్లకు బిల్లులు వసూలు చేస్తారని రైతులు ఆందోళన చెందు తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మిగతా 2లో..



తంపరమూల సంగం పొలంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్

మీటర్లు తీసేస్తారనుకున్నాం



ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్ పెట్టారు. ప్రభుత్వం మారడంతో మీటర్లు తీసేస్తారనుకుంటే మిగిలిన వాటికి కూడా పెడుతున్నారు. ఇవి ఎందుకు పెడుతున్నారో తెలియడంలేదు. మీటర్ పెడుతున్నట్లు రైతుకు చెప్పడంలేదు.

శరగడం అప్పారావు, తంపరమూల సంగం రైతు

వార్త 2లో..



పెద్ద సంఖ్యలో హాజరైన కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు రాజు

వేతన బకాయిలు చెల్లించండి

జివిఎంసి కాంట్రాక్టు కార్మికుల ధర్నా

అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

వార్త 2లో..

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించండి

విశాఖ కలెక్టరేట్ : ఉమ్మడి విశాఖ జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం ప్రకటించిన నేపథ్యంలో తక్షణం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పకుండా పాటించాలన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలపై మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

గుట్టుచప్పుడు కాకుండా స్మార్ట్‌మీటర్ల బిగింపు

ప్రకారం మీటర్లు బిగిస్తున్నట్లు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు చెబు తున్నారు. మునగపాక మండ లం కేంద్రంలోని తంపర మూల సంగం పొలాల్లోని స్మార్ట్ మీటర్ల బిగించడంపై రైతులు అభ్యంతరం వక్తం చేస్తున్నారు. తమకు తెలియకుండా బిగించడమేమిటన్న ప్రశ్న వారి నుంచి వినబడుతోంది.



ఐదు గంటలకు మీటర్ బిగించారు

విద్యుత్ స్తంభానికి ఉదయం ఐదు గంటలకు స్మార్ట్ మీటర్ బిగించి వెళ్లిపోయారు. మీటర్ బిగిస్తున్న సమాచారం తెలియజేయలేదు. ఎన్నికల తరువాత కొత్త ప్రభుత్వం మీటర్లు బిగింపు ఆపుతుందని అనుకున్నాం. గత ప్రభుత్వం వలె మీటర్లు బిగిస్తోంది. ఇపుడు బిల్లు వసూలుచేయకపోయినా, తరువాత వసూలు చేస్తుందన్న భయమేస్తోంది.

దొడ్డి గణేష్, మునగపాక

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిలిపివేయాలి



వ్యవసాయ పంపుసెట్లకు సబ్సిడీపై ఇచ్చే విద్యుత్‌ను ఎత్తివేయడానికి ప్రభుత్వం చేస్తున్న కుట్రలో భాగమే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యుత్ చట్టం ప్రకారం విద్యుత్ సబ్సిడీలు వుండవు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లను తొలగించాలి. కొత్తగా మీటర్ల బిగింపు నిలిపివేయాలి.

కర్రి అప్పారావు,
ఎపి రైతు సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించండి

బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వెబెక్స్ ద్వారా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్, ప్రవర్తనా నియమావళి తదితర అంశాలను జిల్లా అధికారులకు వివరించారు. ఈ నెల 6 నుంచి నోటిఫికేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, 13వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు. 14న స్క్రూటినీ, 16న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ఉంటాయని వివరించారు. ఆగస్టు 30న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, సెప్టెంబర్ 3న ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందని తెలిపారు. ఎఎంసి కోడ్ అమలులోకి వచ్చినందున వెంటనే అన్ని ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో ఉన్న రాజకీయ నాయకుల చిత్రపటాలు, పోస్టర్లు, బ్యానర్లు తొలగించాలని చెప్పారు. బస్సులపై, బస్ స్టేషన్లలో, పబ్లిక్ ప్రదేశాల్లో ఉన్న అనధికార రాజకీయపరమైన ప్రకటనలు, ఇతర చిత్రాలను తొలగించాలన్నారు. ప్రభుత్వ వెబ్‌సైట్లలో ఉన్న రాజకీయ పరమైన ఫొటోలను కూడా తొలగించాల్సి ఉంటుందన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతంలో జివిఎంసి అధికారి, గ్రామీణ స్థాయిలో జిల్లా పంచాయతీ అధికారి ఎంసిసి నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు.

అధికారులు మాత్రమే పింఛన్ల పంపిణీ చేయాలి

ప్రభుత్వ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం పూర్తిస్థాయిలో అధికారులు సమక్షంలో మాత్రమే జరగాలని, రాజకీయ నాయకులు, ఇతర స్థానిక సంస్థల సభ్యుల ప్రమేయం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదని అధికారులకు కలెక్టర్ స్పష్టతనిచ్చారు. వెబెక్స్ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జివిఎంసి, రెవెన్యూ, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసిలో డైలీ వేజ్, లోడర్స్, డే అండ్ నైట్ మాఫింగ్ కార్మికుల బకాయి జీతాలను చెల్లించాలని, స్ట్రీట్ లైట్స్, ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ సక్రమంగా వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి యు.రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మే నెలలో కాంట్రాక్టు కార్మికులుగా 300 మందిని తీసుకున్నారని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో

జివిఎంసి కాంట్రాక్టు కార్మికుల ధర్నా

క్లాప్ ఆటో లోడర్స్‌ను డైలీవేజ్ కార్మికులుగా తీసుకున్నారని చెప్పారు. మూడు మాసాలకు టెండర్ అంటూ 2023 మే నుంచి నేటి వరకు జివిఎంసిలో ఉద్యోగాల వేట జరుగుతోందన్నారు. కొత్తవారిని చేర్పిస్తున్నారని, జీతాల విషయానికి వస్తే మాత్రం కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని తెలిపారు. జివిఎంసిలో లక్షలకు లక్షలు కొంతమంది దోచుకున్నారని విమర్శించారు. ఇప్పుడు జీతాలు చెల్లించకపోవడంతో ఈ భాగోతం బయటపడిందన్నారు. ఇప్పటికైనా బకాయి ఉన్న జీతాలను చెల్లించకపోతే, పెండింగ్ సమస్యలను పరిష్కరించకపోతే కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను ఐక్యం చేసి ఉధృత ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

అనంతరం అక్కడ నుంచి జివిఎంసి ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కమిషనర్‌కు, ఇతర అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు సీర రమణ, గాజువాక జోన్ అధ్యక్షులు గొలగాని అప్పారావు, నాయకులు గణేష్, ఎం.ఈశ్వరరావు, బాలు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల పరిష్కారానికి సంబంధిత అధికారులంతా ప్రత్యేక చొరవ చూపాలని, బాధితులకు సత్వర న్యాయం చేకూర్చాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. పరిహారం చెల్లింపు విషయంలో జాగురూకత వహించాలని, నిర్ణీత కాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, ఇతర అధికారులతో కలిసి కలెక్టరేట్ మీటింగు హాలులో బుధవారం ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ యాక్టుపై డిస్ట్రిక్ట్ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు.

వివిధ అంశాలపై చర్చించారు. కేసుల పరిష్కారానికి అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో భాగంగా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రామారావు గత సమావేశంలో చర్చించి తీసుకున్న చర్యల గురించి వివరించారు. ఇప్పటి వరకు అండర్ ఇన్వెస్టిగేషన్‌లో 138 కేసులు, కోర్టు ట్రైల్ రన్‌లో 699 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.A.43/22, E.P.15/21, O.S. 171/14

D.H.R. :మద్ది సూర్యనారాయణ రెడ్డి (Died)
మద్ది సరోజిని వగైరాలు
J.D.R.:నీలపు కనక అప్పల వెంకటరమణరావు,
తండ్రి లేటు సత్యనారాయణరెడ్డి

నోటీసు

శ్రీకోర్టు వారి ఆర్డరు ప్రకారం పై నెంబరు E.P.లో D.H.R.చనిపోయినందున, వారసులుగా చేర్చమని పిటిషన్ దాఖలు చేయగా నోటీసు నిమిత్తం, కోర్టు ద్వారా ఎన్నిసార్లు పంపించినను మీకు చేరని కారణంగా యీ పేపరు ప్రకటన ద్వారా మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారి ఎదుట **తేది: 27-8-2024న ఉదయం 10-30ని॥** హాజరుగలందుకు పత్రిక ప్రకటన మూలంగా నోటీసులు జారీ చేసియున్నారు. కావున **27-8-24 ఉదయం గం. 10-30 ని॥** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, లేదా వకీల్ ద్వారా గాని, హాజరుఅయ్యి సమాధానం చెప్పవలసి ఉంది. లేనియెడల మీ పై పరోక్షమున పై నెంబరు పిటిషన్, పరిష్కరించగలరని తెలియజేయడమైనది.

డి.బి.పి.రామారావు
డి.హెచ్.ఆర్.తరపు అడ్వకేటు,
యలమంచిలి, అనకాపల్లి జిల్లా.

గౌరవనీయమైన నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ముందు మంగళగిరిలో అమరావతి బెంచ్ కంపెనీలచట్టం, 2013లో

మరియు విలీన పథకం విషయంలో..
M/s. గౌతమి స్టీల్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ట్రాన్స్‌ఫర్ కంపెనీ)
మరియు
M/s. గౌతమి కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (బదిలీ కంపెనీ)
మరియు వారి సంబంధిత వాటాదారులు
మధ్య
CP(CAA) 8/230/AMR/2023తో అనుసంధానించు
CA (CAA) No.4/230/232/AMR/2023
M/s. గౌతమి స్టీల్ ప్రోడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్
CIN: U27105AP1995PTC022086
. . . 1వ దరఖాస్తుదారు కంపెనీ / బదిలీ కంపెనీ
M/s. గౌతమి కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్
CIN: U45200AP1999PTC033015
. . . 2వ దరఖాస్తుదారు కంపెనీ / బదిలీ కంపెనీ

పబ్లిక్ నోటీసు

కంపెనీల చట్టం, 2013లోని 230 నుండి 232 సెక్షన్‌ల ప్రకారం ఉమ్మడి కంపెనీ పిటిషన్ నెం. సీపి(సిఏఏ)8/230 ఏఎంఆర్ /2023ను, గౌరవనీయమైన నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ అమరావతి బెంచ్‌ను మంజూరు చేయాలని కోరడం జరిగింది మరియు గౌతమి స్టీల్ ప్రోడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ట్రాన్స్‌ఫరర్ కంపెనీ) మరియు M/s. గౌతమి కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ట్రాన్స్‌ఫరీ కంపెనీ) మరియు వారి సంబంధిత షేర్‌హోల్డర్లు మరియు క్రెడిటర్లు 2 నవంబర్ 2023న గౌరవనీయమైన నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, అమరావతి బెంచ్ ముందు సమర్పించారు. ఈ పిటిషన్‌ను గౌరవ ట్రిబ్యునల్ 10 జనవరి 2024న అంగీకరించింది.

ఈ విషయంలో, కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్‌లు 230 నుండి 232 వరకు సమ్మేళనం పథకం ప్రకారం సామాన్య ప్రజలకు తెలియజేయనది ఏమనగా, గౌతమి స్టీల్ ప్రోడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ట్రాన్స్‌ఫరర్ కంపెనీ) మరియు M/s. గౌతమి కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ట్రాన్స్‌ఫరీ కంపెనీ) మరియు వారి సంబంధిత వాటాదారులు మరియు రుణదాతల పిటిషన్‌ను అమరావతిలోని గౌరవనీయమైన నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ బెంచ్ వారి ఆర్డరు నెం.సీపి(సిఏఏ)/8/230 ఏఎంఆర్/2023 ద్వారా తేదీ 10.06.2024న ఆమోదం తెలిపారు.

Sd/- సామిరెడ్డి సాయి శరత్ చంద్ర, న్యాయవాది
G5, శారదా అపార్ట్‌మెంట్స్, ఫ్యాకర్ లేఅవుట్,
వాల్తేరు అప్‌ల్యాండ్స్, రామ్‌నగర్, విశాఖపట్నం-530003
పిటిషనర్ కంపెనీల న్యాయవాది

స్థలం:విశాఖపట్నం
తేదీ: 01-08-2024

పోర్టు సిఎస్ఆర్ నిధులు 'దక్షిణం'కు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : విశాఖ దక్షిణం అసెంబ్లీ నియోజకవర్గానికి వైజాగ్ పోర్టు ట్రస్ట్ అథారిటీ (విపిఎ) అత్యధికంగా సిఎస్ఆర్ నిధులు ఇవ్వాలని ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. విశాఖ పోర్టు కాలుష్య నివారణా చర్యలు, ప్రజల ఆరోగ్యాలకు అందించాల్సిన వైద్య సేవలు, స్థానికులకు ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై బుధవారం ఉదయం పోర్టులో సంబంధిత అధికారులు, కంటైనర్ టెర్మినల్ యాజమాన్యాలతో ఆయన భేటీ నిర్వహించారు. పోర్టు సెక్రటరీ టి.వేణుగోపాల్ నేతృత్వంలో ఇతర అధికారులు హాజరయ్యారు. వైజాగ్ పోర్టు తన పరిధిలో చేపడుతున్న కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణ చర్యలను, క్లీన్ పోర్టుగా మారేందుకు ఆధునాతన టెక్నాలజీని ఎలా వినియోగిస్తున్నామన్న అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ ఇప్పుడు చేపడుతున్న పనులను పూర్తి చేస్తే విశాఖ గ్రీన్‌సిటీగా మారుతుందని ప్రశంసించారు. దక్షిణం నియోజకవర్గంలో కాలుష్య నివారణపైనా, విశాఖలో పర్యావరణంపైనా ఇటీవల డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అసెంబ్లీలో చేసిన ప్రసంగ సారాంశాన్ని పోర్టు అధికారుల ఎదుట ప్రస్తావించారు. పోర్టు కాలుష్యంతో ప్రజల ఆరోగ్యాలు దెబ్బతిన కూడదన్నారు. మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. త్వరలో పవన్ నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు సమాచారం ఇచ్చారు.

మరికొన్ని సమస్యలపై...

వన్‌టౌన్ ప్రాంతంలో ఎస్ఆర్ కంపెనీ కాలువ చుట్టూ అపరిశుభ్ర వాతావరణం నెలకొందన్నారు. వెంటనే ఆ పరిసరాలను శుభ్రం చేయించాలని అధికారుల దృష్టికి తెచ్చారు. భారీ వాహనాల రాకపోల వల్ల వన్‌టౌన్ ఏరియాలో స్థానికులు అవస్థలు పడుతున్నారని, వీటిని ఎలా నివారించాలో ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లేందుకు లిఫ్టు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో పోర్టు అధికారులు, శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

IN THE HON'BLE DISTRICT CONSUMER REDRESSAL COMMISSION-I AT: VISAKHAPATNAM
C.C. 37/2024

Between:
P. Swathi Kumari ...Complainant
And:
1) M/s. Benelli India, Rep. by Managing Director,
2) The Service Head BENELLI India,
3) The sales and service head, Benelli, Visakhapatnam
...Opposite Parties

NOTICE

To,
O.P. No.2: The Service Head, BENELLI India, 1098, Road No.36, Jubilee Hills, Hyderabad-500033.
O.P.No.3:The sales and service head, Benelli, Visakhapatnam, Rego Motors, D.No.52-10-42, Resapuvanipalem Road, Beside CMR Central, Maddilapalem, Visakhapatnam-530013.

Please take notice that the above complainant is filed against OP-2 and OP-3 to replace the defected vehicle with new condition and to pay five lakhs rupees for mental agony and other such reliefs and the same stands posted to **09-08-2024** for your appearance either in person or through an Advocate at **10:30 A.M.**, failing which the matter will be heard and decided ex-parte in your absence by the Hon'ble Commission.

(By Order of the Hon'ble Commission)
S. ARUN DEV &
K. RAJA GOPALA RAO,
Advocates, Visakhapatnam.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
S.O.P. 18/2024

Between:
Smt. Pethakamsetti Padmavathi & Another ...Petitioners
And:
1) The Branch Manager, Canara Bank, China Waltair Branch, Visakhapatnam.
2) Ms. Spoorthi Sita Raju
3) Ms. Aarthi Sita Raju
...Respondents

GENERAL NOTICE

The public in general are hereby informed that the abovenamed petitioners filed the above petition to issue Succession Certificate in their favour enabling them to receive the schedule mentioned amount, i.e., an amount of **Rs. 93,15,797/-** which is in the name of late Pethakamsetty Satyanarayana Raju, as a sole proprietor of National Electronic Laboratory, vide A/c.No. 35821400001986 which is lying with respondent No.1, i.e., Branch Manager, Canara Bank, China Waltair, Visakhapatnam who died on 30-08-2022. The above matter stands posted to **22-08-2024.** Therefore the public in general are hereby informed that if anyone having objections in the above matter, please appear before the Hon'ble Court on **22-08-2024** at **10:30 A.M.** and intimate the objections, failing which the matter will be decided exparte in your absence as per law.

P.T. MADHAV &
D. LAKSHMI SUDHA,
Advocates
Visakhapatnam-18
Cell: 9848257381.

IN THE HON'BLE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.1042/2023

Between:
BANK OF BARODA, Dwarakanagar Main Branch, Visakhapatnam Rep. by its Chief Manager ...Plaintiff-Bank
And:
Sri Nagireddy Lakshman Kumar & 2 others ...Defendants

SUMMONS

To,
D-1:Sri Nagireddy Lakshman Kumar
S/o. N. Kesava Rao,
R/at D.No.39-33-121/1, MIG-252,
Phase-2, Madhavadhara,
Visakhapatnam-18.
D-3: Sri Muppidi Ravi Kumar,
S/o. Venkata Rao,
R/at D.No.38-32-87/10/1,
Parvati Nagar, Marripalem,
Visakhapatnam-18.

Please take notice that the above named plaintiff-Bank has instituted the above suit against you for recovery of an amount of **Rs.10,58,847-42ps** and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **27-08-2024** for your appearance on that day **10:30 A.M.** you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be heard and determined in your absence, ex-parte as per law.

(By Order of the Hon'ble Court)
SUNKARA (M) PADMAJA
N. TARAKESWARA RAO,
Advocates
Visakhapatnam. **Cell: 9346187915.**

మనిషి ఆరోగ్యంపై మ్యూజిక్ థెరపీ ప్రభావం

గీతం సదస్సులో నిపుణుల వెల్లడి

ప్రజాశక్తి -మధురవాడ : మనిషి భావోద్వేగాలు, మెదడును చైతన్యపరచడం, ప్రవర్తనలో మార్పులను సంగీతం ప్రభావితం చేస్తుందని, ముఖ్యంగా మ్యూజిక్ థెరపీతో మనిషి ఆరోగ్యాన్ని సరిచేసే శక్తి ఉందని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో నిపుణులు అభిప్రాయపడ్డారు. గీతం ఫైన్ అండ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఇండియన్ మ్యూజిక్ థెరపీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ టివి.సాయిరామ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాగ చికిత్స, నాదయోగ భారతదేశంలో ప్రాచీన కాలం నుంచి ఉన్నాయని ఆయన తెలిపారు. క్రమపద్ధతిలో వెలువడే ధ్వని సంగీతంగా మానవ మెదడుపై ప్రభావాన్ని చూపుతుందన్నారు. సంగీతం ద్వారా చికిత్స అనేది వ్యక్తులను, వారి అభిరుచులను బట్టి ఉంటుందన్నారు. మ్యూజిక్ థెరపీపై అధ్యయనాలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సంగీత, నృత్యవిభాగం చైర్మన్, ప్రముఖ సంగీత విద్వాంసులు డాక్టర్ కె.సరస్వతీ విద్యార్థి మాట్లాడుతూ సంగీతానికి గల శక్తి జయదేవుని అష్టపదులలో, భద్రాచల రామదాసు కీర్తనలు, త్యాగరాజ కృతులలో, ముత్తుస్వామి దీక్షితార్, చామశాస్త్రి రాగాలలో కనిపిస్తుందన్నారు. నచ్చిన సంగీతాన్ని విన్నప్పుడు శరీరంలో బాధల నుంచి ఉపశమనం కలుగుతుందని, మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం సైకాలజీ విభాగం అధిపతి డాక్టర్ గౌరి రామ్మోహన్ మాట్లాడుతూ సంగీత సాధన ద్వారా జ్ఞాపక శక్తి, వ్యక్తిత్వ వికాసం, ఒత్తిడుల నుంచి బయటపడటం జరుగుతాయన్నారు. గీతం ఫైన్ అండ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగం అధిపతి డాక్టర్ అముక్త మాల్యద అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మానసిక వికలాంగులైన బాలలకు శిక్షణ ఇచ్చే లెబెన్స్ షిల్ఫే సంస్థలో సంగీతం ద్వారా బాలలలో తీసుకు వస్తున్న మానసిక మార్పులను సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లక్ష్మీ వివరించారు. కార్యక్రమంలో ఇండియన్ మ్యూజిక్ థెరపీ అసోసియేషన్ కో-ఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీ సూర్యతేజ, సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ బి.నళిని, డాక్టర్ సుష్మారాజ్, డాక్టర్ దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగరావుకు ఘన సన్మానం



నర్సింగరావును సన్మానిస్తున్న మండల అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం వేములవలస గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహించి విరమణ పొందిన పురము నర్సింగరావు దంపతులను మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు, వేములవలస గ్రామపంచాయతీ సిబ్బంది బుధవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ నీలం అప్పలనాయుడు మాట్లాడుతూ, ఉద్యోగ విరమణ కేవలం ఉద్యోగానికి మాత్రమేనని, జీవితానికి కాదన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నో ఒత్తిడిలకు గురవుతూ ఉద్యోగాలు నిర్వహించాల్సి వస్తుందని, వాటిని ఎదుర్కొని ప్రజల మన్ననలు పొందడం అభినందనీయమన్నారు. ఉద్యోగ విరమణ పొందుతున్న నర్సింగరావు మాట్లాడుతూ, మంచి సేవలు అందించడానికి సహకరించిన గ్రామస్తులకు అభినందనలు తెలిపారు. ఆనందపురం మండలంతో తనకు అవినాభావ సంబంధముందని, ఇక్కడ విరమణ పొందడం గర్వంగా ఉందన్నారు. గ్రామ కార్యదర్శిగా 2004 నుంచి 2013 వరకు ఆనందపురం మండలం తర్లువాడలో పనిచేశానని, 2019 నుంచి నేటి వరకు ఇదే మండలం వేములవలస గ్రామపంచాయతీలో విధులు నిర్వహించానని తెలిపారు. శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో గడపాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రామారావు, వెల్లంకి గ్రామ కార్యదర్శి శ్రీరామ్మూర్తి (బాబి), కరుణాకరరావు, మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, వేములవలస సర్పంచ్ లంక కొండమ్మ, ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వరరావు, వేములవలస 10వ వార్డు మెంబర్ సారికి విజయ్‌కుమార్, సచివాలయ సిబ్బంది దేవుడుబాబు, విఆర్‌ఒలు స్వామి, మహిళా పోలీస్ కోరాడ స్వప్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వార్డు అభివృద్ధికి సహకరించాలని వినతి



గంటాకు వినతిపత్రం అందిస్తున్న పిళ్లా మంగమ్మ తదితరులు

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 7వ వార్డు అభివృద్ధికి సహకరించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం నిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు బుధవారం వినతిపత్రం అందించారు. వార్డులో మౌలిక వసతులు, సమస్యలను కార్పొరేటర్ వివరించారు. స్వాతంత్ర నగర్ లక్ష్మీదేవి గుడి నుంచి జాతీయ రహదారి వరకు, కృష్ణానగర్, భరత్‌నగర్ నుంచి ఎన్‌జిఒ కాలనీ, వాంబే కాలనీ శివాలయం నుంచి నగరంపాలెం తుఫాన్ బిల్డింగ్ వరకు రహదారులు నిర్మించాలని కోరారు. చంద్రంపాలెం దుర్గా నగర్, కాలనగర్ ముత్యాలమ్మ గుడి బింద్రనగర్ మొగదరమ్మ కాలనీ, టైలర్స్ కాలనీ, శ్యామ్‌నగర్, దోభి కాలనీలో కాలువలు రోడ్లు మరమత్తులు చేపట్టాలని విజ్ఞప్తిచేశారు. మధురవాడ మార్కెట్ నుంచి స్వతంత్రనగర్ పార్కు వరకు ఇరువైపులా కాలువలు, రోడ్లను నిర్మించాలన్నారు. వార్డు పరిధిలో పలు చోట్ల వీధి దీపాలు, పైపు లైన్ మరమ్మతులు చేపట్టాలని కోరారు.

పిఎం సూర్యఘర్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం సూర్యఘర్ పథకం విద్యుత్తు వినియోగదారులకు ఎంతో ఉపయోగకరమని ఎపిఇపిడిసిఎల్ జోన్-3 ఇఇ పి.శ్రీనివాసరావు అన్నారు. ఈ పథకానికి సంబంధించి వినియోగదారులకు అవగాహన కల్పించడంలో భాగంగా మధురవాడ ప్రధాన విద్యుత్తు కార్యాలయం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. వచ్చే నెల 2వ తేదీ నుంచి విద్యుత్తు బిల్లులు ఇచ్చే ఉద్యోగులతో వినియోగదారులకు ఈ కరపత్రాలు పంపిణీ చేస్తామన్నారు. సూర్యకాంతిని వినియోగించుకోవడం వల్ల విద్యుత్తు బిల్లుల్లో గణనీయమైన తగ్గుదల కనిపిస్తుందన్నారు. రూ.వెయ్యి ఆపైన విద్యుత్తు బిల్లులు వస్తున్న యజమానులు ఈ పథకాన్ని వినియోగించుకో గలిగితే లబ్ధి కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం, భీమిలి, గోపాలపట్నం, పెందుర్తి డీఈఈలు ఆర్.రమేష్, టి.కిరణ్‌కుమార్, ఆర్.రామునాయుడు, ఎస్.అప్పన్నబాబు, ఆయా డివిజన్లకు సంబంధించిన ఏఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మెస్ ఛార్జీలు పెంచాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా బిసి సంక్షేమ వసతిగృహ విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానికంగా ఉన్న బిసి బాలికల కళాశాల వసతి గృహం, బాలుర వసతి గృహాలను ఎఐఎస్ఎఫ్ ప్రతినిధులు బుధవారం సందర్శించారు. ఆయా వసతి గృహాల్లో మెనూ అమలు, ఇతరత్రా సమస్యలను విద్యార్థులనడిగి తెలుసుకున్నారు. శిథిలావస్థలో ఉన్న హాస్టల్ భవనాలకు మరమ్మతులు చేయాలని, అవసరమనుకుంటే కొత్తవి నిర్మించాలని కోరారు. ప్రతి హాస్టల్‌కు శాశ్వత ప్రాతిపదికన వార్డెన్, కుక్, కమాటీ, వాచ్‌మెన్ పోస్టులను భర్తీచేయాలని కోరారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎన్.శ్రీను, శేఖర్, మధు పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పలు సమస్యలను బిసి సంక్షేమ శాఖ జిల్లా అధికారి శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లారు.

అప్పన్న నిత్యాన్న ప్రసాదానికి విరాళం

ప్రజాశక్తి-సింహాచలం : సింహాద్రి అప్పన్న ఆలయంలో జరిగే నిత్యాన్నదాన ప్రసాద వితరణ పథకానికి రెల్లివీధికి చెందిన కుంచుమాంబ కిరాణా వర్తక సంఘం సభ్యులు రూ.ఒక లక్షా 116ను నగదు రూపంలో పిఆర్‌ఒ ఆఫీసులోని డోనర్ కౌంటర్‌కు విరాళం అందించారు. సింహాద్రినాథ శాశ్వత అన్న ప్రసాద పథకం బాండ్‌ను సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, పిఆర్‌ఒ నాయుడు దాతలకు అందజేశారు. తరువాత వారికి స్వామివారి దర్శనం, వేద పండితుల ఆశీర్వచనం అందించారు. స్వామివారి ప్రసాదాలను అందజేశారు.



విద్యార్థినికి ఆర్థిక సాయం చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

వైద్యానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -భీమునిపట్నం : గుండె సంబంధిత వ్యాధితో బాధ పడుతున్న స్థానిక తోటవీధికి చెందిన డిగ్రీ విద్యార్థిని నిత్యశ్రీకి మెరుగైన వైద్యం కోసం స్థానిక ఫ్రెండ్స్ అసోసియేషన్ భీమిలి ఆధ్వర్యాన బుధవారం రూ.10 వేలు సాయం అందించారు. ఇందుకు గాను ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కాళ్ల సన్నీ, ఎం.సూర్య శ్రీనివాస్, కె.రమణారావు, ఎం.గోపి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

2 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు కిలోల గంజాయి పట్టుబడినట్లు నాలుగో పట్టణ సిఐ ఎస్.విజయ్‌కుమార్ తెలిపారు. బాలయ్య శాస్త్రి లే-అవుట్‌లో అశోక్ కుమార్, నక్క కార్తీక్, నవీన్ వద్ద గంజాయి ఉన్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ ప్రమీల తనిఖీలు నిర్వహించారని పేర్కొన్నారు. వారి నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

ఉత్తమ వైద్య సేవలకు అవార్డులు

ప్రజాశక్తి -ఆనందపురం: విధుల్లో ఉత్తమ సేవలందించిన ఆనందపురం పిహెచ్‌సి సిబ్బందికి రెండు అవార్డులు లభించాయి. గిడిజాల ఎఎన్ఎం పొట్నూరి గంగాభవాని, బోయపాలెం ఆశ కార్యకర్త పంపాన వరలక్ష్మికి జిల్లాకలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. విశాఖపట్నం బిర్లా జంక్షన్ ప్రాంతంలో బుధవారం జరిగిన వైద్య అధికారుల సమీక్ష సమావేశంలో అవార్డులను అందజేశారు. జనాభా నియంత్రణ కోసం తాత్కాలిక, శాశ్వత విధానాలు అమలు చేయడంలోనూ, ఆసుపత్రి ప్రసవాలు చేయించడంలోనూ ప్రతిభ కనబరిచినందుకు వీరికి ఈ అవార్డులు లభించాయి. అవార్డులు అందుకున్న సిబ్బందిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు, ఆనందపురం వైద్యాధికారులు ఎం.గంగునాయుడు, షహనాజ్ సాధియా, సామాజిక ఆరోగ్య అధికారి పి సాంబమూర్తి, ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం అభినందనలు తెలిపారు.

వంటావార్పుతో రైతుల నిరసన

ప్రజాశక్తి -మధురవాడ : సినీ పరిశ్రమ ఆర్థిక సహాయంతో నిర్మించిన హుదూద్ ఇళ్ల వద్ద భూములు కోల్పోయిన రైతులు చేపట్టిన నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం వంటావార్పు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రైతుల ప్రతినిధులు మాట్లాడుతూ, రైతులు సాగు చేసుకుంటున్న భూములకు ఏమాత్రం నష్టపరిహారం ఇవ్వకుండా తీసుకున్నారని, కనీసం రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఇళ్లు అయినా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బంక పోతురాజు, ఎస్.పైడిరాజు, కెవిపిఎస్ నాయకులు ఎస్.పైడితల్లి, కె.నాగరాజు, వి.దుర్గ, కుమారి, వి.గణేష్, వి.వెంకటప్పారావు, ఎస్.బంగార్రాజు, సిపిఎం నాయకులు డి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన గ్రామీణ వికాస్ బ్యాంక్ సేవలు

ప్రజాశక్తి-ఆనందపురం: ఆనందపురం మండలం వేములవలస గ్రామంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్‌బ్యాంక్‌లో నాలుగు రోజుల నుంచి సర్వర్లు పనిచేయక లావాదేవీలు నిలిచిపోయాయి. దీంతో కస్టమర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకుకు వెళ్లిన కస్టమర్లు సర్వర్లు పనిచేయక నిరాశతో ఇంటికి తిరిగి వెళ్తున్నారు. ఈ విషయమై బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావును వివరణ కోరగా సాంకేతిక సమస్య వల్ల సేవలను అందించలేకపోతున్నామని, త్వరలోనే సరిచేయనున్నట్లు తెలిపారు.

150 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- ఆనందపురం : సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యాన ఆనందపురం మండలం ముచ్చర్ల గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 150 మంది వైద్య పరీక్షలు నిర్వహించారు. 40 మందికి పలు కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. నలుగురికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. గుర్తింపు పొందిన ఆసుపత్రిలో ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు సేవా సంస్థల ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు పిఆర్ఎస్ఎన్.నాయుడు, మాజీ అధ్యక్షులు నాగేశ్వరరావు, జోన్ కో-ఆర్డినేటర్ సత్యసాయి, గొట్టిపల్లి భజన మండలి కన్వీనర్ కోరాడ తమ్మునాయుడు, డి.అప్పలరాజు, ఆర్యనాయుడు, జిల్లా మెడికల్ కో-ఆర్డినేటర్ సాయికుమార్, సర్పంచ్ షిణగం ఎర్రయ్య, శివ, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెరువు కాలువ పనులు చేపట్టాలి

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం పొడుగుపాలెం గ్రామం దొంతలవాని చెరువు పిల్ల కాలువ పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. 2014లో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హయాంలో పిల్ల కాలువ పనులు మొదలుపెట్టి మధ్యలోనే వదిలేశారు. దీంతో నీరు పొలాల్లోకి వెళ్లకుండా సమీపంలో ఉన్న భూములు నీటి ముంపునకు గురవుతున్నాయి. ఈ విషయంపై గతంలో అధికారులకు విన్నవించినా న్యాయం జరగలేదంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో భీమిలి ఎమ్మెల్యేగా గంటా శ్రీనివాసరావు అధికారంలోకి వచ్చారని, ఇప్పుడైనా కాలువ పనులు పూర్తిచేసి రైతులకు న్యాయం చేయాలని చెరువు కింది రైతులు కోరుతున్నారు.

భారీ వాహనాల మొరాయింపుతో ట్రాఫిక్ ఇబ్బందులు

తరచూ ప్రమాదాలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గం పరిధిలో జాతీయ రహదారి నుంచి వీధి రోడ్ల వరకు అన్నీ వాహనాలతో రద్దీగా ఉంటాయి. ఈ రద్దీ ఉన్న ప్రదేశాల్లో గంగవరం పోర్టు నుంచి వచ్చే వాహనాలు పాత గాజువాక జాతీయ రహదారి వద్ద, షీలా నగర వద్ద, 100 అడుగుల రోడ్డు వద్ద తరచూ మొరాయిస్తున్నాయి. దీంతో వాటిని రోడ్డుపైన నిలుపుదల చేస్తుండటంతో భారీ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. 15 రోజుల క్రితం అక్కిరెడ్డిపాలెం జాతీయ రహదారిపై భారీ టిప్పర్ నిలిచిపోయింది. ట్రాఫిక్ పోలీసులు క్లియర్ చేయలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రోడ్డుపైనే ఆ వాహనం నిలిచేవుంది. అదే రోజు సాయంత్రం వైజాగ్ నుంచి వస్తున్న లారీ, ముందుగా టిప్పర్ ప్రయాణిస్తుందనుకుని వస్తూ దాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ రెండు కాళ్ళు పోయాయి. బుధవారం సాయంత్రం పాత గాజువాక జంక్షన్‌లో కంటైనర్ లారీ ఆయిల్ లేక ఆగిపోయింది. గంటల తరబడి ఆ వాహనం రోడ్డుపైనే నిలుపుదల చేశారు. దీంతో భారీ ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. కొంతమంది ఈ వాహనాన్ని ఢీకొట్టారు. ఇలాంటి ఘటనలో ఘటనలు అనేకం జరుగుతున్నా ట్రాఫిక్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు ప్రమాదాలూ జరుగుతున్నాయి. ఇప్పటికైనా గాజువాక ట్రాఫిక్ అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



బుధవారం సాయంత్రం రోడ్డుపై నిలిచిన కంటైనర్ వాహనం

దీనిపై గాజువాక ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావును వివరణ కోరగా సమాచారం వచ్చిన వెంటనే వీలైనంత తొందరలో క్లియర్ చేస్తున్నామని తెలిపారు. ఎక్కడైనా బందోబస్తులో ఉంటే ఆ రోజు ఆలస్యం అవుతుందని వివరించారు.

రైలు ప్రమాదానికి కేంద్రం బాధ్యత వహించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : జంషెడ్పూర్ రైలు ప్రమాదానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజు, విశాఖ జిల్లా అధ్యక్షులు ఎస్.శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. భద్రతా లోపాలే ప్రమాదానికి ప్రధాన కారణమన్నారు. గత పదేళ్లుగా రైలు ప్రమాదాలు జరుగుతున్నా బిజెపి ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. తగిన చర్యలు తీసుకోనందువల్లే ప్రమాదాలు పునరావృతం అవుతున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైల్వేలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ల పేరుతో పెద్దఎత్తున హడావుడి చేస్తున్నారు తప్ప భద్రతా ప్రమాణాలపై దృష్టిపెట్టలేదన్నారు. తరుచూ సాంకేతిక లోపాలతో ప్రమాదాలు జరగడం సిగ్గుచేటన్నారు. ప్రమాదాల నివారణకు తగు చర్యలు చేపట్టకపోతే రైల్వే రంగం రక్షణ కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. తరచూ రైల్వే ప్రమాదాలపై పార్లమెంట్‌లో ప్రతిపక్ష, వామపక్ష, అభ్యుదయ ఎంపీలు అడుగుతున్నా, దేశవ్యాప్తంగా ప్రజలు ఉద్యమాలు నిర్వహిస్తున్నా స్పందించని రైల్వే శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

రేపు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -యంత్రాంగం

మధురవాడ : మధురవాడ సబ్ స్టేషన్, 11కెవి హిల్ నెంబర్ 1 ఫీడర్, మారికవలస ఇండస్ట్రియల్ ఫీడర్‌పై మరమ్మత్తుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు జోన్ -3 డిఇ పి.శ్రీనివాసరావు తెలిపారు. అయోధ్యనగర్, ఆర్‌టిసి కాలనీ, మానం ఆంజనేయుల కాలనీ, సాక్షి పేపర్, నగరం పాలెం, మారికవలస జంక్షన్, మారికవలస గ్రామం, బోరవానిపాలెం, మారికవలస జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ, బోరవానిపాలెం డ్రైవర్స్ కాలనీ, జెకె.లే-అవుట్, కొత్త పరదేశిపాలెం, పాత పరదేశిపాలెం తదితర ప్రాంతాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సీతమ్మధార : ఎపిఇపిడిసిఎల్ జోన్ 2లోని 11 కెవి తెన్నేటి నగర్ ఫీడర్, కళింగ నగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్ -2 ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బికె.నాయుడు తెలిపారు. కనకదుర్గా ఫంక్షన్ హాల్ జంక్షన్, మాధవధార, గాయత్రి విద్యా మందిర్ రోడ్, జనతా గ్యారేజ్ జంక్షన్, గ్యాస్ గొడౌన్ జంక్షన్, తెన్నేటి నగర్, మాధవస్వామి ఆలయ రోడ్డు, గడ్డప ఎంక్లేవ్, కళింగ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.



అప్పారావును సన్మానిస్తున్న సొసైటీ సభ్యులు, అధికారులు

ఇందుల అప్పారావుకు సన్మానం

ప్రజాశక్తి -గాజువాక : హార్టికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఇందుల అప్పారావును బుధవారం టౌన్ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా హార్టికల్చరల్ డిపార్ట్‌మెంట్ సీనియర్ మేనేజర్ ఎస్ఆర్ఆర్ఎం.కుమార్, అసిస్టెంట్ మేనేజర్ హిమాంస్ మాట్లాడుతూ, అప్పారావు క్రమశిక్షణ కలిగిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పులి నరసింహారావు, పివి.రమణ, కె.రామకృష్ణ, రవిరాజు, పెదగంట్యాడ సొసైటీ ప్రెసిడెంట్ జీలకర్ర రమణ, సెక్రటరీ మొల్లి రమణ, కోశాధికారి గొందేసి పెంటయ్య, జి.సత్యారావు, గంగవరం, అగనంపూడి సొసైటీ ప్రెసిడెంట్‌లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వినాయక రాట

ప్రజాశక్తి -ములగాడ : గాజువాక డిపో సమీపంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో లంబోదర అసోసియేషన్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసే గణనాథునికి సంబంధించి బుధవారం ఎమ్మెల్యే గణబాబు రాట వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భక్తులందరూ అసోసియేషన్‌కు సహకరించి వినాయక ఉత్సవాన్ని విజయవంతంచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, లంబోదర అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పేదలు నివాసమున్నచోటే పట్టాలివ్వాలి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రమణి, జగన్ తదితరులు

ప్రజాశక్తి-పెందుర్తి : పేదలు నివాసమున్న చోటే పట్టాలివ్వాలని సిపిఎం పెందుర్తి జోన్ కార్యదర్శి బి.రమణి డిమాండ్‌చేశారు. పెందుర్తిలోని సిపిఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. 163 సర్వే నెంబర్‌లో 120 మంది పేదలు 2018 నుంచి పాకలేసుకుని నివాసముంటున్నారని, వారికి అక్కడే పట్టాలివ్వాలని కోరారు. పేదలు 60 గజాలు అడిగితే నేరంగా భావిస్తున్నారని, పెద్దలు 1000, 2000 గజాలు, ఎకరాలు ఆక్రమించుకున్నా ప్రభుత్వ అధికారులకు పట్టడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. చినముషిడివాడలో రాముడు చెరువును ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు ఆక్రమించుకున్నారని తెలిపారు. 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేవుడు చినముషివాడ జంక్షన్లో సుమారు 2000 గజాల స్థలం రోడ్డు పక్కనే ఆక్రమించి రెగ్యులేషన్ చేసుకున్నారని గుర్తుచేశారు. చిన ముషిడివాడ నుంచి గణేష్ నగర్ వెళ్లే దారిలో 3 ఎకరాల స్థలంలో లారీలు పెట్టి ఆక్రమించారన్నారు. పెద్దలకు పట్టాలు, పేదలకు తొలగింపులు సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్, జోన్ నాయకులు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లేక అవస్థలు

ప్రజాశక్తి-సీతమ్మధార : బక్కన్నపాలెం హుదూద్ హౌసింగ్ కాలనీలో విద్యుత్ లేక 151 నిరుపేద కుటుంబాలు అవస్థలు పడుతున్నాయని ఎబివియసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ ఆవేదన వ్యక్తంచేశారు. విద్యుత్ సరఫరా వచ్చేలా చర్యలు చేపట్టాలని కోరుతూ ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి కార్యాలయం వద్ద బుధవారం బాధితులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హుదూద్ సమయంలో ఇళ్లు కోల్పోయిన బాధితులు 320 కుటుంబాలకు బక్కన్నపాలెం వద్ద ఇళ్లు నిర్మించారని, అందులో 151 కుటుంబాలకు వెరిఫికేషన్ పూర్తి చేసి, డ్రా తీసి స్వాధీన పత్రం, ప్రభుత్వ పట్టాలు అందించారని తెలిపారు. 151 కుటుంబాలూ పిల్లాపాపలతో నివసిస్తున్నారని, విద్యుత్ లేక చీకట్లో పాములు, దోమలతో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించాలని కోరారు. అనంతరం ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.చిన్న, సరోజని, అనూరాధ, బోగేష్, శ్రీను, రాజు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంత విలేకర్ల సంఘం ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -ములగాడ : పారిశ్రామిక ప్రాంత విలేకర్ల సంఘాన్ని ఆ ప్రాంత విలేకర్లు ఏర్పాటుచేసుకున్నారు. జివిఎంసి 58వ వార్డు పరిధి కొత్తనక్కవానిపాలెంలోని ఒక ఫంక్షన్ హాల్లో బుధవారం రిజిస్ట్రేషన్ ప్రక్రియను స్థానిక ఎమ్మెల్యే గణబాబు సమక్షంలో పూర్తిచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశం, రాష్ట్రంలోని సమాచారం ప్రజలకు చేరవేయడంలో విలేకర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. నిరంతరమూ ప్రజల సమస్యలను వెలికితీస్తూ ఉండే విలేకర్లకు తాను అండగా ఉంటానన్నారు. అనంతరం ఎమ్మెల్యే గణబాబును పారిశ్రామిక ప్రాంత విలేకర్ల సంఘం ఆధ్వర్యాన సత్కరించారు. పారిశ్రామిక ప్రాంత విలేకర్ల సంఘం పాలకవర్గ సభ్యులను పరిచయం చేశారు. గౌరవాధ్యక్షులుగా సుంకర చలపతిరావు, అధ్యక్షులుగా ముప్పిడి వెంకటగిరి, ఉపాధ్యక్షులుగా గుప్తా, కార్యదర్శిగా ఎన్.రాజు, సహ కారదర్శిగా నూనెల పైడిరాజు, ఎల్.అప్పలరాజు, ఉప్పలు గణేష్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ అధికారులు నారాయణ పాత్రుడు, శ్రీకాంత్, శర్మ, ములగాడ తహశీల్దార్, ఆర్ఐ, మల్కాపురం సిఐ, విద్యుత్ శాఖ అధికారులు, సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, టిడిపి నాయకులు రామ్మోహన్‌నాయుడు, టిడిపి 58వ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, టిడిపి 61వ వార్డు అధ్యక్షుడు మజ్జి సోమేష్, అంగ దుర్గాప్రశాంతి, సరస్వతి శ్రీలక్ష్మి, టిఎన్‌టియుసి నాయకులు నక్క లక్ష్మణరావు, బిజెపి నాయకులు శ్రీనివాసరావు, మజ్జి మాలియుడు, పొట్టి మూర్తి, బోగవిల్లి నాగభూషణం, కొరివిల్లి రాము, జయశంకర్, ఉరుకూటి దేవిడ్, నాగేశ్వరరావు, పుర్రె సురేష్ యాదవ్, శంకర్ ఫౌండేషన్ అధికారులు పాల్గొన్నారు.

తుపాకీ సంస్కృతిపై 2న సదస్సు

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రపంచ వ్యాప్తంగా పెచ్చుమీరుతున్న తుపాకీ సంస్కృతిపై ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థల ఆధ్వర్యాన ఈ నెల 2వ తేదీన డాక్టర్ ఎల్‌బి.కాలేజీ ప్రాంగణంలో సదస్సు నిర్వహించనున్నట్లు వైజాగ్ ఫిలిం సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం కాలేజీ గాంధీ సెంటర్ ఆవరణలో సెంటర్ అధ్యక్షులు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ ఆవిష్కరించారు. సదస్సు వివరాలకు 9032477463 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య రామకృష్ణ, డాక్టర్ కెవిఎస్ఎన్.మూర్తి, అబ్దుల్ మునీర్ ముషాద్ పాల్గొన్నారు.

విద్యార్థుల కంటి పరీక్షకు కార్యాచరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : జిల్లా అంధత్వ నివారణ సంస్థ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పర్యవేక్షణలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంటి పరీక్షలు చేయడానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ వి.మీనాక్షి తెలిపారు. జిల్లాలో సుమారు 220 పాఠశాలల్లో 51954 మందికి పారా మెడికల్ ఆఫ్తాల్మిక్ ఆఫీసర్లు, అసిస్టెంట్లు కంటి పరీక్షలు చేసి వారిలో 3557 మందికి కళ్లద్దాలు ఉచితంగా ప్రభుత్వమే ఏర్పాటు చేసేలా ఆగస్టు 1వ తేదీ నుంచి 3 నెలల లోపు పూర్తి చేసేలా కార్యక్రమాన్ని రూపొందించినట్లు వివరించారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

ప్రజాశక్తి -గాజువాక : సామాజిక సేవలో భాగంగా గాజువాక వెంకీ బాయ్స్ ఆధ్వర్యాన పాత గాజువాకలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఒకేసారి ఐదు రక్త సేకరణ కేంద్రాల సిబ్బంది యువత నుంచి రక్తాన్ని సేకరించారు. శ్రీ లక్ష్మీ ఫర్నీచర్ అధినేత తిరిమిరెడ్డి వెంకటేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సౌత్ సబ్ డివిజన్ ఏసిపి టి.త్రినాథ్, గాజువాక సిఐ శ్రీనివాసరావు పాల్గొని రక్తదాతలకు అభినందన పత్రాలను అందజేశారు. వందే భారత్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి వినోద్ బాబు మాట్లాడుతూ, ఒకరి జన్మదినాన్ని పురస్కరించుకొని ఎంతో మందికి పునర్జన్మనిచ్చేలా పెద్ద ఎత్తున రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. అన్ని దానాల్లో రక్తదానం గొప్పదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉరుకూటి చైతన్య, మోహన్, సాయి, తంకల సతీష్, కోవిలపల్లి జోగి నాయుడు, చంద్రమౌళి, ఎన్‌టిఆర్ మెమోరియల్ బ్లడ్ బ్యాంక్, వందే భారత్ బ్లడ్ బ్యాంక్, అమ్మ బ్లడ్ బ్యాంక్, న్యూ లైఫ్ బ్లడ్ బ్యాంక్, సంజీవిని వాలంటరీ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెంటకోట జగన్నాథం ఆశయ సాధనకు కృషి

వర్ధంతి సభలో సిపిఎం జిల్లా నాయకులు శంకరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

సిపిఎం సీనియర్ నాయకులు, రైతు ఉద్యమ నేత కామ్రేడ్ పెంటకోట జగన్నాథం ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు అన్నారు. పెంటకోట జగన్నాథం 4వ వర్ధంతి సందర్భంగా బుధవారం సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి శంకరావు, పార్టీ మండల నాయకులు కె.తెల్లయ్యబాబులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ పెంటకోట జగన్నాథం జీవితాంతం ఎర్రజెండా నీడలో కార్మిక, కర్షక అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేశారని తెలిపార. 84 సంవత్సరాల వయస్సులో కూడా యువకులతో కలిసి ఉద్యమాల్లో పనిచేయటం ఆయన నిబద్ధతకు నిదర్శమన్నారు. అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో కార్మిక కర్షక ఉద్యమాలను నిర్వహించడమే కాకుండా మహిళా ఉద్యమానికి సహకారం అందించేవారని చెప్పారు. ఆయన భార్య కామ్రేడ్ చిట్టమ్మడును ప్రోత్సహించి కౌన్సిలర్‌గా, మహిళా సంఘానికి నాయకత్వం వహించే స్థాయికి తీసుకొచ్చారన్నారు. ఎరువుల కొరత సమయంలో గొడౌన్స్ బద్దలుకొట్టి రైతులకు ఎరువులు పంపిణీ చేయించారని, కరువు, వరదల కాలంలో పేద ప్రజలకు సహాయ, సహకారాలు అందించి సేవా కార్యక్రమాలు నిర్వహించేవారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతంలో సిపిఎం విస్తరణకు ఆయన కృషి చేశారన్నారు. ఆయనను స్ఫూర్తిగా చేసుకుని పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు, నాయకులు కె.ఈశ్వరరావు, పి.చలపతి పాల్గొన్నారు.



పెంటకోట జగన్నాథం చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు



రౌతు శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న పల్లా శ్రీనివాస్ తదితరులు

ఘనంగా రౌతు శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పరవాడ : గ్రేటర్ విశాఖ పరిధి లంకెలపాలెం, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా ఆయన స్వగృహంలో నిర్వహించారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, పెందుర్తి నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ గండి బాబ్జి, టిడిపి నేత పీలా శ్రీనివాస్ హాజరై రౌతు శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు పైలా జగన్నాథరావు, ఇల్లపు వరలక్ష్మి, ఇల్లపు ప్రసాద్, బలిరెడ్డి అప్పారావు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా 2024-25 విద్యా సంవత్సరానికి టెన్త్, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతిలో చేరడానికి 15 సంవత్సరాలు, ఇంటర్మీడియట్‌లో చేరడానికి పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని కోరారు. జులై 31 నుంచి అడ్మిషన్లు ప్రారంభం, ఆగస్టు 27 అడ్మిషన్లకు ఆఖరి తేదీ, ఫీజు చెల్లించడానికి ఆఖరి తేదీ ఆగస్టు 28, 200 లేట్ ఫీజుతో సెప్టెంబర్ 4 వరకు అడ్మిషన్లను పొందవచ్చని పేర్కొన్నారు. www.apopenschool.ap.gov.in వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు సదరు వెబ్సైట్ను సందర్శించాలని సూచించారు.

వీధి కుక్కలను నియంత్రించాలని వినతి

ప్రజాశక్తి-దేవరాపల్లి : గ్రామాల్లో విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్న వీధి కుక్కలను నియంత్రించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ ఆధ్వర్యంలో ఎంపీడీవో అప్పలరాజుకు మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో కొన్ని ప్రాంతాల్లో చిన్నపిల్లలు, స్కూల్‌కి వెళ్లే పిల్లలను, ముసలి వాళ్ళను చంపేస్తున్నటువంటి సంఘటనలు జరుగుతున్నాయని, అటువంటి ప్రమాదం మండలంలోని గ్రామాల్లో చోటుచేసుకోముందే చర్యలు తీసుకోవాలని కోరారు. రాత్రి 8 దాటితే గ్రామాల్లో వీధి కుక్కల హడావిడి ఎక్కువగా ఉంటుందని, దేవరాపల్లి మండల కేంద్రంలో కూడా భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కొరుప్రోలు శ్రీను, గంగ

పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : పాఠశాలల మేనేజ్మెంట్ కమిటీల ఎన్నికలను ప్రధానోపాధ్యాయులు ఎంతో పారదర్శకంగా నిర్వహించాలని ఎంఈఓ కె.సత్యనారాయణ ఆదేశించారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల కమిటీల పేరును మేనేజ్మెంట్ కమిటీలుగా ప్రభుత్వం మార్పు చేసిందని చెప్పారు. గత ప్రభుత్వంలో ఎంపికైన కమిటీల పదవీకాలం జూలైతో ముగియడంతో ఆగస్టులో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులు ఎన్నికలకు ఆగస్టు 1న మధ్యాహ్నం రెండు గంటలకు ఓటర్ల జాబితాను నోటీసు బోర్డులో ప్రదర్శించాలని, 5న ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు ఓటర్ జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారని, అదే రోజు సాయంత్రం మూడు నుండి నాలుగు గంటల మధ్య తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారని పేర్కొన్నారు. 8న ఎన్నికల నిర్వహిస్తారని అనంతరం ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి మొదటి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. సమావేశంలో ఎంఈఓ 2 డివిడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్టు మండల విద్యాశాఖ అధికారి బుద్ధ కాశీ విశ్వేశ్వర రావు బుధవారం తెలిపారు. ఆగస్టు 1న ఓటర్ జాబితాలను ప్రదర్శన, 5న జాబితాపై అభ్యంతరాల స్వీకరణ 8వ తేదీన కమిటీల ఎన్నిక ఉంటుందని తెలిపార. మండలంలోని ప్రాథమిక పాఠశాల 48, యూపీ స్కూల్ 5, ఉన్నత పాఠశాలలో 8, కేజీబీవీ 1 మొత్తం 62 పాఠశాలలకు స్కూల్ మేనేజ్మెంట్ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.

గొట్టివాడ హెల్త్ సెంటర్‌కు నాణ్యతా ధ్రువీకరణ పత్రం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గొట్టివాడ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌కు జాతీయ నాణ్యత ధ్రువీకరణ పత్రం లభించినట్లు ఆ గ్రామ సర్పంచ్ సాలాపు మీనా తెలిపారు. జూలై 12న కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నేషనల్ క్వాలిటీ అసెస్మెంట్ సర్వీసెస్ టీం సభ్యులు గొట్టివాడ వెల్నెస్ సెంటర్లో అందిస్తున్న సేవలకు సంబంధించి అన్ని రికార్డులను, పరిసరాలను పరిశీలించి ఈ అవార్డు ప్రకటించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సాలాపు వెంకటేశ్వరరావు, బగ్గు ఈశ్వరరావు ,బోండా శివరాం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలిలో ఎన్టీఆర్ భారీ విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా కూటమి నేతలంతా మున్సిపల్ కమిషనర్ ప్రభాకరరావును బుధవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. కూటమి నేతలు గొర్లె శివన్నారాయణ మూర్తి, బొద్దపు శ్రీనివాసరావు మాట్లాడుతూ జూనియర్ కాలేజ్ ఎదురుగా అన్న క్యాంటీన్ సమీపంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కమిషనర్‌ను కోరారు. విగ్రహ నిర్మాణానికి అయ్యే ఖర్చంతా స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఏర్పాటు చేస్తారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ, ఇత్తంశెట్టి నాయుడు, పి.సత్యనారాయణ, కరణం రవి, ఆడారి రమణ, గుర్రాల రాము, పెయ్యల రామకృష్ణ పాల్గొన్నారు.

బీసీలకు కార్పొరేషన్ల రుణాలు ఇవ్వాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : గత ఐదు సంవత్సరాలలో మూలన పడిపోయిన బీసీ కార్పొరేషన్ రుణాలను రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న 139 బీసీ కులాలకు వెంటనే మంజూరు చేయాలని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మొల్లి రమణబాబు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ శాఖలలో ఖాళీలను పూరించి ఉద్యోగాలను కల్పించాలని కోరారు.

ఘనంగా ఉద్యోగ విరమణ ఆత్మీయ వీడ్కోలు



రామలక్ష్మిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు తదితరులు

ప్రజాశక్తి- కశింకోట

మండలంలోని తాళ్ళపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో సబ్ అడ్మినేటర్‌గా విధులు నిర్వహించి బుధవారం ఉద్యోగ విరమణ చేసిన యువి.రామలక్ష్మిని ఘనంగా సత్కరించారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామలక్ష్మిని ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ రామలక్ష్మి అంకితభావంతో తన విధులను నిర్వర్తించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. 38 సంవత్సరాల పాటు విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రామలక్ష్మి కుటుంబం సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

మునగపాక : మండలంలోని వాడ్రాపల్లి జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బర్రె రత్నరాజ్ ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం పాఠశాలలో సన్మానసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు మాట్లాడుతూ రత్నరాజ్ సేవలు మరువలేనివన్నారు. 40 ఏళ్లపాటు రత్నరాజు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ ఎంతోమంది విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దారని ప్రశంసించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు రత్నరాజు దంపతులను గజమాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా తెలుగు రైతు నాయకులు మల్ల వరాహ నర్సింగ్ రావు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనకాపల్లి : ఆర్మ్డ్ రిజర్వ్ ఏఆర్ఎస్సై టి.సత్యనారాయణ రాజు దంపతులను జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయ భాస్కర్, ఎస్‌బి డీఎస్పీ బి.అప్పారావు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, దిశ డీఎస్పీ ఎం.ఉపేంద్ర బాబు, ఏ.ఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, గణేష్, సతీష్, మన్మధరావు, నరసింహమూర్తి, సంజీవరావు, ఎస్సైలు రామారావు, రఘువర్మ, జిల్లా సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ములబంద గోడి రైతు సంఘం అధ్యక్షునిగా శివ

ప్రజాశక్తి-మునగపాక : "ములబందగోడి" రైతు సంఘం సర్వసభ్య సమావేశం స్థానిక వినాయక కళ్యాణ మండపంలో బుధవారం జరిగింది. ఏడాది కాలంలో జరిగిన మంచి చెడ్డలపై పెద్దలు, పలువురు సభ్యులు మాట్లాడారు. అనంతరం ఎన్నికల అధికారి దాడి సూర్యనారాయణ సారథ్యంలో నూతన పాలక వర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడుగా దాడి శివ, కార్యదర్శిగా ఆడారి రాము, కోశాధికారిగా దొడ్డి గంగ సూరి అప్పారావులు, డైరెక్టర్లుగా బొడ్డేడ రాము, టెక్కలి శ్రీనివాసరావు, సూరిశెట్టి కాశి, దొడ్డి మురళి, యల్లపు శ్రీను, దాడి సాంబ శివ, కొర్ని వెంకట్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు దాడి శ్రీరామమూర్తి, బొడ్డేడ రామునాయుడు, దాడి శివ కృష్ణ, దొడ్డి శివ, దొడ్డి రమణ, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై సమావేశం

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై ఎంపీడీవో ఎస్.అప్పలరాజు బుధవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందితో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు నెలకు మండలంలోని 10,293 మంది లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీ కోసం రూ.4,17,50,500 విడుదల చేసినట్లు చెప్పారు. పెన్షన్ల పంపిణీలో 191 సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొంటారని చెప్పారు. పెన్షన్ల పంపిణీలో ఎవరైనా అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సందర్భంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలని ఆదేశించారు. తక్షణమే రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసి, గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపిఆర్డి సంతోష్ నళిని పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : ఎన్టిఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ గురువారం ఉదయం 5 గంటల నుంచే ప్రారంభించాలని ఎంపీడీఓ టి.వెంకటాచార్యులు ఆదేశించారు. ఈ మేరకు బుధవారం మండలంలోని రాజాం సచివాలయం సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న తప్ప మిగతా వారికి 99 శాతం పింఛన్ల పంపిణీ 1వ తేదీనే పూర్తి చేయాలని ఆదేశించారు.

అందరి సహకారంతో మండలాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల ప్రజలు, అధికారుల సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేస్తానని నూతన ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి అన్నారు. ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి కొన్ని నెలల క్రితం రాజీనామా చేయడంతో వైస్ ఎంపీపీ -1 చింతల బుల్లిలక్ష్మికి ఎంపీపీ బాధ్యతలను అప్పగిస్తూ జడ్పీ సీఈవో ఈనెల 4న ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో వైసిపి మండల అధ్యక్షులు బూరె బాబురావు అధ్యక్షతన బుధవారం రైవాడ జలాశయం వద్ద అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ బుల్లి లక్ష్మి, ఆమె భర్త ఏ.కొత్తపల్లి సర్పంచ్ చింతల వెంకటరమణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కర్రి సత్యం, వైస్ ఎంపీపీ -2 ఉగ్రుకుల గంగా భవాని, వైసిపి నాయకులు కర్రి సూరి నాయుడు, వరదపురెడ్డి సింహాచలం నాయుడు, నారాయణమ్మ, కె.వి రమణ, రమాదేవి, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఎంపిపి, వైసిపి నేతలు



ధర్మశ్రీని పూలమాలతో సత్కరిస్తున్న వైసిపి శ్రేణులు

ఘనంగా ధర్మశ్రీ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి-చోడవరం : మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పుట్టినరోజు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. గాజువాకలో ధర్మశ్రీ నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పల్ల నర్సింగరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, మండల వైకాపా అధ్యక్షులు దొడ్డి వెంకటరావు, ఒరుగంటి నెహ్రూ, బొడ్డేటి సూర్యనారాయణ, సేనాపతి సత్యారావు, సూరిశెట్టి నాగ గోవింద, వేసలుపు ప్రకాష్, సింహాద్రి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో పాఠశాల పరిసరాలు పరిశుభ్రం

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని మొగలిపురం గ్రామంలో గ్రామస్తుల శ్రమదానంతో పాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేశారు. మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి ఆధ్వర్యంలో గ్రామస్తులు పాఠశాల ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను, చెత్త, చెదారాలను తొలగించి పాఠశాల ఆవరణలో పరిశుభ్రంగా చేశారు. ఈ సందర్భంగా గండి బాబ్జి మాట్లాడుతూ ప్రభుత్వాలు వచ్చి పని చేస్తాయని అనుకోకుండా గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలను గ్రామస్తులు సమిష్టిగా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తమరాన బంగారు నాయుడు, అంగటి నానాజీ, తమరాన సత్యనారాయణ, బయలపూడి రాంబాబు, గండి శ్రీరాములు, మేడపాటి రాము, లైన్మెన్ నాయుడు, అయినింటి రాజు, గోటివాడ అప్పారావు, సిరపరపు రాంబాబు, గండి నరేష్, గండిదేముళ్ళు, గండి కిషోర్ కుమార్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది ఇఒ ఆధ్వర్యంలో పారిశుధ్యంపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వడ్డాది పంచాయతీ ఈఓ లోవరాజు మాట్లాడుతూ ఈనెల 25 నుండి ఆగస్టు 10 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా డ్రైనేజీలు, వాటర్ ట్యాంకర్లు శుభ్రం చేస్తామన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందుగా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిశారు. కార్యక్రమంలో పిహెచ్సి డాక్టర్ సిహెచ్ శకుంతల, పంచాయతీ, వైద్య సిబ్బంది, కెజిబివి విద్యార్థినులు పాల్గొన్నారు.

సిసిఆర్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని ఏ కోడూరు రైతు సేవ కేంద్రంలో కౌలు రైతులకు క్రాప్ కల్టివేటర్స్ రైట్ (సిసిఆర్) కార్డులను మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిసిఆర్ కార్డు వలన కౌలు రైతుల అనేక ప్రయోజనాలు పొందుతారని తెలిపారు. కే కోటపాడు మండలంలో ఇప్పటివరకు 22 గ్రామాల్లో 70 కౌలు ద్రవపత్రాలను అందజేశామన్నారు. భూ యజమాని కౌలు రైతుకు అంగీకార పత్రం ఇవ్వడం వల్ల ఎటువంటి ఇబ్బంది కానీ నష్టం కానీ ఉండదన్నారు. ఈ కార్డు గడుగు కేవలం 11 నెలల కాలపరిమితి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో విజయ్ తదితరులు పాల్గొన్నారు.



సిసిఆర్ కార్డులు అందిస్తున్న వ్యవసాయాధికారి సోమశేఖర్

గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి

జిల్లా ఎస్పి దీపిక

ప్రజాశక్తి- అనకాపల్లి

గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. దర్యాప్తులో ఉన్న సాధారణ, తీవ్రమైన, ముఖ్యమైన కేసులు, ప్రాపర్టీ కేసులు, 174 సీఆర్పీసీ కేసులు, గంజాయి కేసులు, మిస్సింగ్ కేసులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు. ఆయా కేసుల్లో దర్యాప్తు పెండింగ్లో ఉండడానికి గల కారణాలను సంబంధిత అధికారుల నుండి తెలుసుకొని త్వరితగతిన దర్యాప్తు చేయుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా జరిగే ఆంధ్ర, ఒడిస్సా సరిహద్దు జిల్లాల, ఏజెన్సీ ప్రాంతం వైపు నుండి వివిధ మార్గాల్లో గంజాయి అక్రమ రవాణాను గుర్తించడం, ఇంటిలిజెన్స్ సమాచారాన్ని సేకరించి ఆకస్మిక, డైనమిక్ వాహన తనిఖీలు నిర్వహించడం చేయాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా కేసుల్లో పోలీస్ సిబ్బంది పాత్ర ఉన్నట్లు విచారణలో వెల్లడైతే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు, బాలికలపై జరిగే నేరాలు పట్ల పోలీస్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని, దర్యాప్తును సమగ్రంగా నిర్వహించి కోర్టులో శిక్షలు పడే విధంగా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నేరాలు నియంత్రణకు పగలు, రాత్రి గస్తీలను ముమ్మరం చేయాలని, బ్యాంకులు, ఏటీఎంలు వద్ద తనిఖీలు నిర్వహించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ, ఎన్ఫోర్స్మెంట్ కేసులు ఎక్కువ నమోదు చేయాలన్నారు. ఈ నేర సమీక్ష సమావేశంలో ప్రతిభ కనబరిచిన 15 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పి దీపిక

బస్టాండ్లో మళ్లీ మొదలైన ఆకతాయిల ఆగడాలు

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు
- పోలీసులు చర్యలు తీసుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి - యలమంచిలి

యలమంచిలి బస్టాండ్లో గంజాయి బ్యాచ్, ఆకతాయిల ఆగడాలు మళ్లీ మొదలయ్యాయి. దీంతో విద్యార్థినులకు రక్షణ కరువైంది. సాయంత్రం నాలుగు గంటలైతే చాలు విద్యార్థుల ముసుగులో "మత్తు బ్యాచ్" రంగ ప్రవేశం చేస్తుంది. రకరకాల టూ వీలర్స్తో విన్యాసాలు చేస్తూ ప్రయాణికులను, ముఖ్యంగా విద్యార్థినులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. యూనిఫాం ధరించిన విద్యార్థులతో మమేకమై వీరు వికృత చేష్టలతో రెచ్చిపోతున్నారు. బస్టాండ్లో నిలిపిన బడి బస్సుల్లో క్లాసులు ఎగ్గొట్టి వారు ఎవరికీ కనబడకుండా పడుకొని, బయల్దేరే సమయానికి ర్యాగింగ్కు పాల్పడుతున్నారని అక్కడి పాఠశాల విద్యార్థినులు కొందరు చెబుతున్నారు. వీరి ఆగడాలపై ప్రజాశక్తి చొరవతో గత వారంలో పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు స్టేషన్కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినా వారి ఆగడాలు ఆగలేదు. ఆకతాయిల ఆగడాలు తిరిగి మొదలయ్యాయి. ముఖ్యంగా గంజాబ్యాచ్ మూలంగానే అగచాట్లు పడుతున్నామని విద్యార్థినులు వాపోతున్నారు. కొన్ని ప్రైవేటు కాలేజీలు యాజమాన్యాలు కూడా తమ కళాశాల విద్యార్థులకు రక్షణ కల్పించాలని పోలీసులకు విన్నవించినట్లు తెలిసింది. కొత్తగా టౌన్ పోలీసు స్టేషన్కు ఎస్ఐగా మహిళను నియమించిన సందర్భంలో తమకు తగిన రక్షణ కల్పిస్తారని బస్టాండ్ బాధితులు భావిస్తున్నారు.

కశింకోట- బంగారు మెట్ట రోడ్డులో

భారీ వాహనాల రాకపోకలతో భయాందోళన

ట్రాలీల నుండి కింద పడుతున్న గ్రానైట్ రాళ్లు



రోడ్డు పక్కన పడ్డ భారీ గ్రానైట్ రాయి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

కసింకోట-బంగారుమెట్ట రోడ్డులో భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పెద్ద పెద్ద గ్రానైట్ రాళ్ళు, స్టోన్ క్రషర్ల నుండి పెద్ద పెద్ద రాళ్ళు రవాణా చేసే లారీలు, ట్రాలీలు ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తుండడంతో వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. బుధవారం మధ్యాహ్నం రాజాం జంక్షన్ బుచ్చయ్యపేట వైపుగా తాత్కాలిక చెరకు కాటాల మలుపులో ట్రాలీపై రవాణా చేస్తున్న గ్రానైట్ బండలు పొలాల్లో పడిపోయాయి. అయితే ఆ సమయంలో రోడ్డుపై వేరే వాహనాలు ప్రయాణించకపోవడం పెద్ద ప్రమాదం తప్పింది. వాహనం నడిపేటప్పుడు ఈ రాళ్లు జారి వెనుక వచ్చే వాహనాలపై పడితే ప్రమాదం ఏ విధంగా ఉంటుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. రాజాం జంక్షన్కు ముందు భారీ రాళ్ళను తరలించే ట్రాలీ రోడ్డుపైనే కూరుకుపోయి రోడ్డు మొత్తాన్ని ధ్వంసం చేసింది. భారీ వాహనాలతో ఒకవైపు రోడ్డు మరమ్మతుల గురవుతుంటే మరొకవైపు వాహనాల నడిపించేటప్పుడు ప్రమాదకరంగా ఉండడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. భారీ వాహనాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు.

ఎన్టిపిసి సింహాద్రి నైపుణ్యాభివృద్ధి శిక్షణ పూర్తి

ప్రజాశక్తి- పరవాడ : పరవాడ ఎన్టీపీసీ సింహాద్రి తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కార్యక్రమం స్థానిక యువత కోసం నిర్వహించిన ఆరు నెలల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. విజయవాడలోని సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్) సహకారంతో ఈ శిక్షణ నిర్వహించారు. ఈ మేరకు ఎన్టిపిసి సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సంజయ్ కుమార్ సిన్హా సమక్షంలో విజయవాడలో సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ సిన్హా మాట్లాడుతూ ఎన్టీపీసీ సింహాద్రి అందించిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని శిక్షణ పొందిన వారికి అభినందనలు తెలిపారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమానికి అంబాసిడర్లుగా పనిచేయాలని కోరారు. మూడవ బ్యాచ్లోని ట్రైనీలకు సర్టిఫికెట్లు, 100 శాతం హామీతో కూడిన జాబ్ ఆఫర్ లెటర్లు పంపిణీ చేశారు. స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం నాల్గవ బ్యాచ్ ప్రస్తుతం జరుగుతోందని, ఆగస్టుతో అది ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఆర్ హెడ్ బిబి పాత్ర, ఎస్ఆర్ హెచ్ఆర్ మేనేజర్ కె ప్రకాశరావు, విజయవాడ డైరెక్టర్, సిపెట్ హెడ్ చంద్ర శేఖర్, ఇన్స్టిట్యూట్ టీచింగ్ స్టాఫ్తో సహా ఇతర అతిథులు పాల్గొన్నారు.

పలువురికి సత్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగర పోలీసు శాఖలో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన పది మందిని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి బుధవారం సత్కరించారు. ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. సత్కరింపబడిన వారిలో ఎడిసిపి (అడ్మిన్) ఎంఆర్కె.రాజు, ఎసిపిలు ఆర్విఎస్.నారాయణ, మొహమ్మద్ జమాలుద్దీన్, కె.సూర్యనారాయణ, ఎఆర్ ఎస్ఐలు జి.ఈశ్వరరావు, కె.వెంకటేశ్వర్లు, హెచ్సి వి.ప్రతాప్, ఎఆర్ హెచ్సిలు జె.వెంకటరవి, ఎస్.శంకరరావు, సిహెచ్.గోవిందరాజు ఉన్నారు. పోలీస్ శాఖలో 40 ఏళ్లకు పైగా సేవలందించడం గొప్ప విషయమన్నారు.

1222వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు బుధవారానికి 1222వ రోజుకు చేరాయి. దీక్షల్లో పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకట లక్ష్మి, కార్యదర్శి ఇందిర పాల్గొన్నారు.

ప్రాచీన హస్తకళలను పరిరక్షించుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రాచీన హస్తకళలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత నేటితరంపై ఉందని అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా స్టేట్ కమిటీ సభ్యురాలు కోట దేవకి దేవి అన్నారు. ఆశీల్మెట్టలోని కెఎ.పాల్ ఫంక్షన్ హాల్లో అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా స్టేట్ కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల ఏర్పాటుచేసిన డ్వాక్రా ఎగ్జిబిషన్ను బుధవారం సాయంత్రం డ్వాక్రా స్టేట్ కమిటీ సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హస్తకళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని కోరారు. హస్త కళాకారుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఇటువంటి ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎగ్జిబిషన్లో ఉన్న పలు స్టాల్స్ను సందర్శించారు.

స్థాయీ సంఘం నామినేషన్లకు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి స్థాయీ సంఘం ఎన్నికలకు దాఖలైన 20 మంది అభ్యర్థుల నామినేషన్లు అన్నీ సక్రమంగా ఉన్నాయని జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటలతో నామినేషన్ల ఉపసంహరణ గడువు పూర్తవుతుందని, 7న ఎన్నికలు నిర్వహించడం, అదేరోజు ఫలితాలను వెల్లడించడం జరుగుతాయని తెలిపారు.

పంట కాలువలో పూడిక తొలగింపు

ప్రజాశక్తి-మునగపాక : అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు మార్గానికి ఆనుకొని మట్టితో పేరుకుపోయిన వంటకాలువ పూడికలను స్థానిక రైతులు శ్రమదానం, ప్రొక్లైనర్ సహాయంతో బుధవారం తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. కాలువ పూడిక కారణంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎగువ ప్రాంతం నుండి దిగువనున్న పొలాలకు నీరు చేరకపోవడంతో సొంత నిధులు, శ్రమదానంతో కార్యక్రమం చేపట్టినట్లు పసలమారమ్మ రైతు సంఘం అధ్యక్షులు కాంద్రేగుల జగ్గపురావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఇరిగేషన్ ఏ ఈ లోకేష్, విఆర్ఓ బిందు, సర్వేయర్ భవాని పరిశీలించగా గ్రామ రైతు సంఘం అధ్యక్షులు ఆడారి మహేష్, జనసేన, టిడిపి నాయకులు ఆడారి శ్రీకాంత్, ఆడారి లక్ష్మణరావు, రైతులు ఆళ్ల జగ్గారావు, ఆళ్ల ముసలి నాయుడు, ఆడారి అప్పారావు, ఆళ్ల గణపతి, జగప్పారావు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ విత్తనోత్పత్తిపై అవగాహన

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం మున్సిపాలిటీ బలిఘట్టం గ్రామంలో బుధవారం గ్రామీణా విత్తన ఉత్పత్తి పథకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు మాట్లాడుతూ రైతు తన పొలములో తాను పండించిన పంటనే కొన్ని మెళకువలు పాటించి విత్తనంగా తయారు చేసుకుని గ్రామంలో విత్తనం కొరత కలగకుండా సాటి రైతులకు విత్తనం అందుబాటులో ఉంచాలన్నారు. మిగిలిన రైతులకు అమ్మకం చేసుకొని రైతు ఆర్థికంగా ఎదగాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏడిఎ శ్రీధర్ మాట్లాడుతూ మూడు దశలలో ట్రైనింగ్ పెడతామన్నారు. రైతులు సాంకేతిక సలహాలు పాటించాలని, ప్రతి రైతు కూడా పంట పండించేటప్పుడు నాట్లు వేయు దశ మొదలు కొని పంట కోత వరకు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది శ్రీహరి, ప్రసాద్ రైతులు పాల్గొన్నారు.

కోటవురట్ల: విత్తనోత్పత్తిపై రైతులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి బి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

మోహనరావు అన్నారు. బుధవారం మండలంలో ఎండపల్లి గ్రామంలో రైతులకు విత్తన ఉత్పత్తిపై అవగాహన కల్పించారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో రైతులు స్వయంగా విత్తనాన్ని ఉత్పత్తి చేసుకునేందుకు నారుమడి దగ్గర నుండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పంట పొలంలో కలుపు, చీడపీడలు ఆశించకుండా ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకొని సస్యరక్షణ చేపట్టాలన్నారు. అనంతరం బికె.పల్లి గ్రామాల్లో సందర్శించిన వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పొలంబడి ద్వారా తీసుకోవలసిన జాగ్రత్తలను సూచనలు సలహాలు అందజేశారు, కార్యక్రమంలో ఎడిఎ శ్రీధర్, మండల వ్యవసాయ అధికారిని సరోజిని, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగుల: మండలంలోని అవురువాడ గ్రామంలో బుధవారం గ్రామీణ విత్తనోత్పత్తి పథకం పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఎం వాసుదేవరావు పాల్గొని రైతులకు వివిధ సూచనలు సలహాలు అందించారు. ఈ పథకంలో భాగంగా గ్రామ రైతులకు ఎంటియు - 1061 (ఇంద్ర) ఫౌండేషన్ సీడ్ 7.50 క్వింటాళ్ళుతో రాయితీపై అందజేస్తామన్నారు. విత్తనోత్పత్తి వరిసాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించవలసిన ఆధునిక పద్ధతులు ,సమగ్ర ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణతోపాటు పంట కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించినట్లు ఎఒ వాసుదేవరావు తెలిపారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది ఎస్ స్వప్న గ్రామ రైతులు పాల్గొన్నారు.

చురుగ్గా యాక్విడెట్ మరమ్మతులు



యాక్విడెట్ మరమ్మతులను పరిశీలిస్తున్న నేతలు, అధికారులు

ప్రజాశక్తి - నాతవరం: మండలం తాండవ జలాశయ ప్రధాన కుడి కాలువ యాక్విడేట్ వద్ద మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి. అధికారుల నిర్వాకం వల్లే పంట కాలువలు మరమ్మతుల్లో తీవ్ర అలసత్వం చోటుచేసుకుంటోందని, అందుకే ప్రజా ప్రతినిధులు పరిశీలించి యుద్ధ ప్రాతిపదిన మరమ్మతులు చేపట్టాలని నిశ్చయించుకున్నారు తాండవ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ రామకృష్ణ పర్యవేక్షణలో మరమ్మతు పనులు చేస్తున్నారు. ఉన్నత స్థాయి అధికారులు ప్రజా ప్రతినిధులు ఆదేశాలతో మరమ్మత్తుల పనులు చేస్తున్నామని చెప్పారు. జలాశయం నుంచి పంట పొలాలకు నీరు విడుదల చేసేలోగానే పూర్తి చేస్తామని, అలాగే కుడికాలువ ప్రధాన గేట్ల మరమ్మతులు కూడా చేస్తామని నేతలు, అధికారులు అంటున్నారు.

సిపిఎస్ రద్దు చేయాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

ప్రజాశక్తి -కొత్తకోట : ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయు లకు ఆర్థికంగా ఇబ్బందిగా ఉన్న సిపిఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ డిమాండ్ చేశారు. బుధవారం రావికమతం మండలంలో దొండపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వెదురుపర్తి నాగేశ్వరరావు ఉద్యోగ విరమణ కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ వేలాదిమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు సిపిఎస్ పెన్షన్ విధానం వల్ల ఉద్యోగ విరమణ తరువాత బతుకుకు భరోసా లేకుండా పోతోందని, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కారణంగా తక్షణం సిపిఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఉపాధ్యాయులు హేతుబద్ధీకరణకు జారీ చేసిన 117 జీవోను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ యాప్‌లో పాఠశాలకు సంబంధించిన వివిధ అంశాలను అప్‌లోడ్ చేసే పనిభారాన్ని ఉపాధ్యాయుల నుంచి వేరొకరికి అప్పగించాలని పెద్దల సభలో చర్చిస్తానన్నారు. మెసెంజర్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు.కార్యక్ర మంలో రావికమతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన హెచ్‌ఎంకు సత్కారం



హెచ్‌ఎం దంపతులను సత్కరిస్తున్న అతిథులు

ప్రజాశక్తి -కొత్తకోట : ఉద్యోగ విరమణ చేసిన రావికమతం మండలం దొండపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెదురుపర్తి నాగేశ్వరరావును బుధవారం పాఠశాలలో ఘనంగా సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ు ముఖ్య అతిథులుగా ఉత్తరాంధ్ర పట్ట భద్రుల ఎమ్మెల్సీ వేపాడా చిరంజీవిరావు, ఉత్తరాంధ్ర టీచర్ల ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, డిప్యూటీ డిఇఒ. పి అప్పా రావు, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు గోపినాధ్ పాల్గొన్నారు. నాగేశ్వరరావు మాస్టారును ఘనంగా సన్మానించారు. రావికమతం ఎంఇఒలు తలుపులు,బ్రహ్మాజీ పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎం దంపతులకు సత్కారం

గొలుగొండ: మండలంలోని చోద్యం పాఠశాలలో ఉద్యోగ విరమణ చేసిన హెచ్‌ఎం జి రత్నాజీ దంపతులను బుధవారం హైస్కూల్లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది వారి సేవలను కొనియాడారు. అనంతరం చోద్యం హైస్కూల్ సిబ్బంది రత్నాజీ దంపతులను గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అడిగర్లప్పలనాయుడు, స్థానిక సర్పంచ్ ఆదుపురెడ్డి గోపాలకృష్ణ విశ్రాంత డిఇఒ కేశవరావు, పిఆర్‌టియు జిల్లా నాయకులు గోపీనాథ్, వైస్ ఎంపిపి సుర్ల బాబ్జి, గొలుగొండ ఎంఇఒ సత్యనారాయణ, నర్సీపట్నం ఎంఇఒ నాగేంద్ర, పలువురు పూర్వ విద్యార్థులు, అధికారులు వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.



రత్నాజీ దంపతులను సత్కరిస్తున్న అతిథులు, అభిమానులు

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ప్రిన్సిపల్ శ్రీదేవి

ప్రజాశక్తి -నక్కపల్లి :నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం ప్రిన్సిపల్ కె శ్రీదేవి ఆధ్వర్యంలో పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు.విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు ప్రభుత్వం ఉచితంగా అందజేసిన పాఠ్యపుస్తకాలను, నోట్‌బుక్‌లను విద్యార్థులకు అందజేసినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. గత విద్యా సంవత్సరం పరీక్ష ఫలితాల్లో జిల్లాలో 4వ స్థానం సాధించడం జరిగిందని ,ఈ విద్యా సంవత్సరం పరీక్షా ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించే విధంగానూ ,జిల్లాలో ఉత్తీర్ణతలో మొదటి స్థానంలో నిలిచే విధంగా అధ్యాపకులతో కలిసి కృషి చేస్తామన్నారు.కార్యక్రమంలో అధ్యాపకులు , అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు .

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు

ప్రజాశక్తి -కోటవురట్ల: ప్రభుత్వం అందజేస్తున్న ఇసుకను అక్రమ రవాణా చేస్తే ఉపేక్షించేది లేదని స్థానిక ఎస్ఐ రమణయ్య హెచ్చరించారు. బుధవారం తెల్లవారు జామున రాజుపేట నుండి ఎడ్ల బండ్లు ద్వారా డంపింగ్ చేసి ట్రాక్టర్‌పై అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు, పట్టుపడ్డ వాహనాన్ని స్టేషనుకు తరలించారు, ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నది నుంచి నేరుగా వినియోగదారులు తీసుకెళ్తేనే ఉచిత ఇసుక అవుతుందని, డంపింగ్ చేసి అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవన్నారు, ఎడ్ల బళ్ల యజమానులు కూడా ఇటువంటి వాటిని ప్రోత్సహించినట్లయితే చర్యలు తీసుకుంటామన్నారు.

ఐటిఐలు, కాలేజీల్లో సమస్యలను పరిష్కరించండి



ప్రిన్సిపల్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : అనకాపల్లి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐ కళాశాలల్లో ఈనెల 12న నిర్వహించే ల్యాబ్ పరీక్షలు మాస్ కాపింగ్ జరగకుండా నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జీ.గీతాకృష్ణ కోరారు. బుధవారం నర్సీపట్నంలో ఐటిఐ జిల్లా కన్వీనర్ శ్రీనివాసచారిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం గీతాకృష్ణ మాట్లాడుతూ ప్రైవేట్ ఐటిఐ కళాశాలలో సరైన సదుపాయాలు లేక విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఐటిఐ కోర్సులకు తగ్గ ల్యాబ్స్ లేని ప్రైవేట్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ జ్ఞానేశ్, నాతవరం మండల సెక్రెటరీ రాజు తదితరులు పాల్గొన్నారు

కసిమి గిరిజనులకు వైద్యసేవలు

ప్రజాశక్తి- గొలుగొండ : మండలంలో గిరిజన గ్రామమైన కసిమిలో చీడిగుమ్మల పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ధనుంజయ్ ఆద్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు, మలేరియా, ఇతర సీజనల్ వ్యాధుల పరీక్షలు చేశారు అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు డయేరియా మలేరియా టైఫాయిడ్ వ్యాధులపై డాక్టర్ ధనుంజయ్ అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు మధుసూధనరావు, ఎంఎల్‌హెచ్ పి వెంకటలక్ష్మి, ఎఎన్ఎం లోవ లక్ష్మి, ఆశా వర్కర్లు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం ఇండోర్ సబ్ స్టేషన్‌లో, దుర్గమ్మ టెంపుల్ ఫీడర్ పరిధిలో ఈనెల 2వ తేదీన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నర్సీపట్నం డివిజనల్ ఇంజనీర్ విడివి.రామకృష్ణారావు తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రామారావుపేట, వెంకునాయుడుపేట, బొంతువీధి, ఆర్డీవో ఆఫీస్ ఏరియా, బంగ్రారాజు థియేటర్ ఏరియా, అబీద్ సెంటర్, ఏరియా ఆసుపత్రి ఏరియా, పోలీస్‌స్టేషన్ ఏరియా, గచ్చపువీధి, కొత్తవీధి, వెలమవీధి, తురకబడి, సిబిఎం కాంపౌండ్, డీఎస్పీ ఆఫీస్ ఏరియా, ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, పీనారిపాలెం ఏరియాలో విద్యుత్ ఉండదన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులు స్థానికంగా పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి సహకరించాలని కోరుతూ పలు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు బుధవారం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు గతంలో మాదిరిగా 50 శాతంపైగా ఫీజు రాయితీ కల్పిస్తూ మెమో ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

గత సంవత్సరం మాదిరిగానే వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్‌కు జర్నలిస్టులు చెల్లించాల్సిన ప్రీమియంను సిఎస్ఆర్ కింద చెల్లింపునకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సార్వత్రిక ఎన్నికల ముందు నుంచీ పెండింగ్‌లో ఉన్న ప్రెస్ అక్రిడేషన్లు జారీ చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎపియుడబ్ల్యుజె జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రాము, ఆర్.రామచంద్రరావు, ఉపాధ్యక్షులు కె.చంద్రమోహన్, లోకల్ న్యూస్ పేపర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సత్యనారాయణ, దవళేశ్వరపు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్ల సమస్యలపై మంత్రికి వినతి



రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సుభాష్‌కు వినతిపత్రం ఇస్తున్న మణి, శ్రామిక మహిళలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన పథకం, విఒఎ, ఆర్‌పి, నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న మహిళా కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు చెల్లించాలని కోరుతూ బుధవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ పి.మణి ఆధ్వర్యాన ప్రతినిధివర్గం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మణి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కార్మికులు 42 రోజులపాటు సమ్మె చేశారని, ఆ సందర్భంగా ప్రభుత్వం వారికి గ్రాడ్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, జీతాలు పెంపుదల వంటి సమస్యలపై హామీ ఇచ్చిందని, దానికి సంబంధించిన జిఒలను నేటికీ ఇవ్వలేదని తెలిపారు. చంద్రబాబు తన ఎన్నికల మ్యానిఫెస్టోలో వీరందరి జీతభత్యాలు పెంచుతానని పేర్కొన్నారని తెలిపారు. ఈ క్రమంలో నూతన ప్రభుత్వం తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆశాలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆర్‌పిలుగా ఉన్నవారికి మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలన్నారు. మహిళలు పనిచేస్తున్న అన్ని చోట్లా లైంగిక వేధింపుల నిరోధక అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.వెంకటలక్ష్మి, అర్బన్ అధ్యక్ష, కార్యదర్శులు నూకరత్నం, కృప, ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.పద్మ, వి.మేరీ, కోశాధికారి సీతారత్నం పాల్గొన్నారు.

కొరుప్రోలు గిరిజనులకు
త్వరలో ఉపాధి జాబ్ కార్డులు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన



గిరిజనులతో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి- రోలుగుంట : రోలుగుంట మండలం ఎంకే.పట్నం పంచాయతీ కొరుప్రోలు గ్రామస్థులు మంగళవారం జాబ్ కార్డులు ఇప్పించి ఉపాధి పనులు కల్పించాలని ఆందోళన చేసిన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ తక్షణమే ఉపాధి హామీ పథకం పీడీకి ఇచ్చిన ఆదేశాల మేరకు పిడి స్పందించారు. దీంతో రోలుగుంట మండలం ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ బి.తాతబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ రాము బుధవారం ఆ గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఆదివాసి గిరిజన లబ్ధిదారుల నుండి ఆధార్ కార్డులు, బ్యాంకు ఎకౌంటు, రేషన్ కార్డు వాటి జిరాక్స్ కాపీల తీసుకున్నారు. త్వరలోనే జాబ్ కార్డులు మంజూరు చేసి పని కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే.గోవిందరావు, ఆదివాసీ గిరిజన సంఘం గెమ్మెలి సుబ్బారావు, లక్ష్మి గ్రామస్తులు పాల్గొన్నారు.

8న పాఠశాల యాజమాన్య కమిటీలకు ఎన్నికలు
- నేడు షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి -కొత్తకోట : స్కూల్ మేనేజ్మెంట్ కమిటీల పునరవ్యవస్థీకరణ కోసం ఎన్నికలు వచ్చే నెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి తలుపులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రావికమతం మండలంలో 51 మండల ప్రాథమిక పాఠశాలలు, తొమ్మిది యూపీ పాఠశాలలు , మరో 11జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో ఎన్నికలు నిర్వహి స్తారని, దీనికి సంబంధించి ఈనెల ఒకటిన గురువారం 10 గంటలకు నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలిపారు .ఆదే రోజు మధ్యాహ్నం ప్రతి స్కూల్స్ లో రెండు గంటలకు ఎన్నికలకు సంబంధించి ఓటర్ జాబితాను ప్రదర్శిస్తారని, వచ్చే నెల 5న ఓటర్ జాబితాలపై అభ్యంతరాలు ఉంటే పరిష్కారం చేసుకోవచ్చునని తెలిపారు, ఈనెల 8న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంఇఒ తలుపులు తెలిపారు.

ప్రభుత్వ వైద్యులు
సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న వైద్యులు అందరూ ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులకు హాజరై సమయపాలన పాటించాలని బుధవారం జగదాంబ జంక్షన్‌లో గల బిల్లు జంక్షన్ హాలులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అధ్యక్షతన పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. సిహెచ్‌సి, యుపిహెచ్‌సిలలో ఒపి పెంచడం వల్ల కెజిహెచ్ ఒపి రద్దీ కొంతవరకు తగ్గించవచ్చునన్నారు. వైద్యాధికారులు స్థానిక ప్రజలకు అందుబాటులో ఉంటారనే నమ్మకాన్ని కలిగించాలన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులు పేద సామాజిక తరగతికి చెందినవారే ఉంటారు కనుక వారిని కొంచెం శ్రద్ధగా చూడాలని కోరారు. సమీక్షలో భాగంగా ఎంసిహెచ్ సేవలు, పిహెచ్‌సిలలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, ప్రైవేటు ఆసుపత్రులు కంటే ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన సేవలు అందుతాయనే నమ్మకం కలిగే విధంగా చూడాలని చెప్పుకొచ్చారు. ఎఎన్‌సి నమోదు శత శాతం చేయాలన్నారు. పత్రికల్లో వచ్చే వార్తలపై వైద్యాధికారులు వెంటనే స్పందించి 11, 12 గంటలలోపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి వివరణ పంపించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి జగదీశ్వరరావు, డాక్టర్ పూర్ణేంద్రబాబు, డాక్టర్ ఎస్.జీవనరాణి పాల్గొన్నారు.

విఎంఆర్‌డిఎ కమిషనర్ సుడిగాలి పర్యటన



వివిధ అభివృద్ధి పనుల పరిశీలనలో కమిషనర్ విశ్వనాథన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. క్షేత్రస్థాయి విషయాలను తెలుసుకున్నారు. తొలుత ఎంవిపి కాలనీ సెక్టార్ -9లో ఉన్న విఎంఆర్‌డిఎ హెల్త్ ఎరీనాను పరిశీలించారు. పాడైన విషయ సూచికలను, సిమెంట్ బెంచీలు, విదుద్దీపాలను మార్చాలని, సందర్శకులకు తగిన తాగునీరు, పారిశుధ్య సదుపాయాలు కల్పించాలని, వృక్ష వ్యర్థాలను సాధ్యమైనంత త్వరగా తరలించాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కైలాసగిరి, సిరిపురంలోని బాలల ప్రాంగణం, వైశాఖి జల ఉద్యానవనం, సీతమ్మధార, ఎంవిపి.కాలనీల్లోని సంస్థకు చెందిన దుకాణ సముదాయాలను సందర్శించారు. దుకాణదారుల నుంచి బకాయిలను సకాలంలో వసూలు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న వాణిజ్య సముదాయాల కేటాయింపునకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట విఎంఆర్‌డిఎ కార్యదర్శి కీర్తి, డిఎఫ్ఒ శాంతి స్వరూప్, సిఇ భవానీ శంకర్, ఎస్ఇ బలరామరాజు, రేంజ్ ఆఫీసర్లు శ్యామల, శార్వాణి, కార్యనిర్వాహక ఇంజినీర్లు రాజు, రామరాజు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ మురళీకృష్ణ, సహాయక ఇంజినీర్ హసీనా బేగం పాల్గొన్నారు.

ఘనంగా మానస మహాలక్ష్మి వార్షికోత్సవం



మాట్లాడుతున్న మహిళా సంఘం చైర్‌పర్సన్ అమ్మాజీ

ప్రజాశక్తి - మాడుగుల: మాడుగుల కేంద్రంలో మానస మహాలక్ష్మి మహిళా మ్యాక్స్ 24వ వార్షికోత్సవాన్ని సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం మానస మహాలక్ష్మి మహిళ పరస్పర సహాయక సహకార పొదుపు సంఘ చైర్‌పర్సన్ పి అమ్మాజీ అధ్యక్షతన, సంఘ సిఇఒ వి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పుట్టా గంగయ్య పాల్గొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి పొదుపు సంఘం ద్వారా మేలైన సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా మానస మహాలక్ష్మి సిఇఒ, యాజమాన్యాన్ని అభినందించారు సిఇఒ పరమేశ్ మాట్లాడుతూ మానస మహాలక్ష్మి పొదుపు సంఘం 105 మంది మహిళలతో ప్రారంభమై నేడు నాలుగు వేలకు పైబడి సభ్యత్వం కలిగి మహిళలు పొదుపు చేస్తున్నారన్నారు. మహిళల పొదుపు అలవాటుతో ఎన్నో ప్రయోజనాలున్నాయని, వారు ఆర్థిక సామాజిక రంగాలలో బలోపేతం కావడానికి పొదుపు ఎంతగానో సహకరిస్తుందని పరమేష్ అన్నారు. గ్రామ సర్పంచ్ ఎడ్ల కళావతి, సంఘం డైరెక్టర్లు, సంఘ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

జిల్లా న్యాయమూర్తి దృష్టికి న్యాయవాదుల సమస్యలు



జిల్లా న్యాయమూర్తిని అభినందిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : ఇటీవల నూతనంగా ఎన్నికైన నర్సీపట్నం బార్ అసోసియేషన్ సభ్యులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి శ్రీధర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మెట్టా ప్రభాకర్, కార్యదర్శి ఆనిమిరెడ్డి శివకృష్ణ కోర్టు సముదాయంలో పలు సమస్యలను న్యాయమూర్తి దృష్టికి తీసుకువెళ్లారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అదనపు జిల్లా న్యాయస్థానం ఏర్పాటు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నియామకం, కోర్టు రెండవ అంతస్తుకు త్వరితగతిన అనుమతులు, మహిళ న్యాయవాదులకు వసతి వంటి అంశాలపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి శ్రీధర్ సానుకూలంగా స్పందించారు.రాష్ట్ర బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కె.కృష్ణమోహన్, స్థానిక బార్ వైస్ ప్రెసిడెంట్ కోసూరు అప్పలనాయుడు, మాజీ కార్యదర్శి లోకా లోవరాజు, కెవి.రమణ, వి.గోవిందరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో
ఇగ్నో అధ్యయన కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) విశాఖ నగరంలో ప్రధాన అధ్యయన కేంద్రాన్ని స్థానిక విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రారంభించింది. వర్సిటీ ప్రాంతీయ కేంద్ర సీనియర్ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు అధ్యక్షతన ఈ కార్యక్రమం సాగింది. ఇగ్నో పూర్వ సంచాలకులు డాక్టర్ ఎస్.రాజారావు, మహిళా కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఆర్.మంజుల ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత ఇగ్నో అధ్యయన కేంద్రానికి కేటాయించిన ఆఫీసు గదిని అతిథులు ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ధర్మారావు మాట్లాడుతూ ఇగ్నో కార్యక్రమాల ద్వారా మహిళా కళాశాల విద్యార్థినులకు తగినంత ప్రోత్సాహాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఇగ్నో ఉపసంచాలకులు డాక్టర్ ఇ.కృష్ణారావు, అధ్యయన కేంద్రంలో సమన్వయకర్తగా నియమితురాలైన డాక్టర్ శిరీష, ఉద్యోగులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

23వ వార్డులో రోడ్లు వేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి 23వ వార్డులో మద్దిలపాలెం, చైతన్యనగర్, కెఆర్ఎం.కాలనీ వీధుల్లో సిమెంట్ రోడ్లను వెంటనే వేయాలని సిపిఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. జివిఎంసి అధికారులు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, పైపులైన్ల మరమ్మతుల పేరిట వార్డులోని అన్ని వీధుల్లో రోడ్లు తవ్వి అలానే ఉంచేయడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాకాలంలో మట్టి, చెత్త ఇళ్లలోకి చేరుతోందన్నారు. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టినందున తక్షణమే సిమెంట్ రోడ్లు వేయాలన్నారు. కాలువలు, గెడ్డల్లో చెత్త, పూడికలు తొలగించే చర్యలు చేపట్టాలని కోరారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు.

సూరత్ - బ్రహ్మపూర్
ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల అదనపు రద్దీని నియంత్రించేందుకు సూరత్ - బ్రహ్మపూర్ - సూరత్ మధ్య ప్రత్యేక రైళ్ల సేవలను పొడిగించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో 09069 సూరత్-బ్రహ్మపూర్ స్పెషల్ ఆగస్టు 7 నుండి నవంబర్ 27 వరకు ప్రతి బుధవారం మధ్యాహ్నం 14.20 గంటలకు సూరత్‌లో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 20:10 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 20:12 గంటలకు బయలుదేరి మూడో రోజు తెల్లవారుజామున 1.15 గంటలకు బ్రహ్మపూర్ వెళ్తుంది. అదేవిధంగా 09070 బ్రహ్మపూర్ - సూరత్ స్పెషల్ ఆగస్టు 9 నుండి నవంబర్ 29 వరకు ప్రతి శుక్రవారం తెల్లవారుజామున 3.30 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి 8:20 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 8.22 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 13.45 గంటలకు సూరత్ చేరుకుంటుంది. ఈ రైళ్లు నందుబార్, ధరంగావ్, జలగోన్, భూసావల్, అకోలా, వార్ధా, బల్లార్ష, వరంగల్, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస మీదుగా ప్రయాణిస్తాయి.

ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
44వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధం
Advt. Feature
విశాఖపట్నం | గురువారం 01-08-2024 | 16 పేజీలు

ప్రత్యామ్నాయ జర్నలిజానికి ప్రతీక ప్రజాశక్తి

- తెలుగు గడ్డపై చైతన్య కిరణం
- దినదినాభివృద్ధి.. కొత్త పుంతలు
- జనమే అండాదండ
- నేడు 44వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - విశాఖపట్నం

తెలుగు నేలపై చైతన్య కిరణం ప్రజాశక్తి. 'ప్రతి అక్షరం - ప్రజల పక్షం'గా సాగుతూ ప్రత్యామ్నాయ ప్రజా జర్నలిజానికి అసలుసిసలైన ప్రతీక.. ప్రజాశక్తి. ఇది అక్షర తూటాలతో అవినీతి, అక్రమాలను చీల్చి చెండాడుతుంది. ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొడుతుంది. ధనస్వామ్యంపై ధ్వజ మెత్తుతుంది. నిస్సహాయుల తరుపున నికరంగా నిలబడుతుంది. సమాజ మార్పునకు విశేష కృషి చేస్తుంది. అందుకే అది ప్రజల పత్రికగాను, కార్మిక, కష్టజీవుల పత్రికగాను గుర్తింపు పొందింది. ఈ పత్రికకు అడుగడుగునా జన సహాయం అందుతూనే ఉంది. ప్రజలే దీనికి అండాదండ. అన్ని రంగాలకు చెందిన వార్తలు ప్రచురిస్తూ ప్రజాశక్తి ప్రజల ఆదరణ పొందుతోంది. వార పత్రిక నుంచి దిన పత్రికగా, ఆ తరువాత టాబ్లాయిడ్, అనంతరం కలర్ పత్రికగా ఆవిర్భవించింది. ప్రత్యేక అంశాలతో ప్రజలను ఆకట్టుకుంటూ దినదినాభివృద్ధి చెందుతోంది. దీనిలో భాగంగానే పత్రిక అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు 44వ వార్షికోత్సవం నిర్వహించుకుంటోంది. ఈ నేపథ్యంలో ప్రజాశక్తి ప్రస్థానాన్ని గుర్తు చేసుకుందాం.

1980 సంవత్సరపు ఆఖరి రోజులు. అఖిలపక్ష రైతు ఉద్యమం రాష్ట్ర రాజకీయాలను ఉర్రూతలూపింది. మూడు నెలలపాటు రకరకాల పిలుపులతో రాష్ట్రం వేడెక్కింది. వారపత్రికగా నడుస్తున్న ప్రజాశక్తి ఉద్యమావసరాలకు సరిపోవడం లేదనే ఆవేదన పెరుగుతోంది. మరో వైపున పత్రికల విస్తరణ ఊపందుకుంది. అలాంటి తరుణంలో సిపిఎం పశ్చిమ బెంగాల్ కమిటీ నుంచి అనుకోని ప్రతిపాదన వచ్చింది. అరవయ్యవ దశకంలో ఆంధ్రప్రదేశ్ కమిటీ తన దినపత్రిక అచ్చుయంత్రాన్ని (మిగతా 7లో..)



విజయవాడలో ప్రజాశక్తి దినపత్రిక ప్రారంభ సభలో ప్రసంగిస్తున్న సుందరయ్య, వేదికపై నంబూద్రిపాద్, మోటూరు హనుమంతరావు (ఫైల్ ఫోటో)

విశాఖ నగరాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

- 100 రోజుల డెడ్‌లైన్‌తో పని
- అందరి సమన్వయంతో ప్రణాళికలు అమలుకు కృషి
- అన్ని వ్యవస్థలనూ ప్రక్షాళన చేసే దిశగా జివిఎంసి కమిషనర్ సంపత్‌కుమార్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నగరాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో కృషిచేయనున్నట్లు జులై 23న గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) నూతన కమిషనర్ పి.సంపత్ కుమార్ బాధ్యతల స్వీకరణ అనంతరం పలు అంశాలపై తన ప్రాధాన్యతలను వెల్లడించారు. 25లక్షల జనాభాతో రాష్ట్రంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌గా వెలుగొందుతున్న విశాఖ బాధ్యతలను తనకు ముఖ్యమంత్రి చంద్రబాబు అప్పగించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పనిచేసేందుకు ఆయన ఆనందం వ్యక్తం చేశారు. స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ మిషన్ డైరెక్టర్‌గా ఉన్న సమయంలో విశాఖనగరంలో పి సంపత్‌కుమార్ పర్యటించారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో విశాఖను మొదటి స్థానంలో నిలిపే దిశగా ప్రణాళికలు రచిస్తున్నారు.



రెస్పాన్స్ సివిక్ బాడీగా నగరంలో మార్పునకు 100 రోజుల ప్లాన్...

ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలాగ 100 రోజుల్లో పలు రంగాల్లో విశాఖను మార్చే దిశగా 'రెస్పాన్స్ సివిక్ బాడీ'గా నగరాన్ని తీర్చిదిద్దే కృషికి కమిషనర్ శ్రీకారం చుట్టారు. పర్యావరణ పరిరక్షణ కోసం నగరంలోని పలు సంస్థలు, పరిశ్రమల సహకారంతో ముందడుగు వేసే దిశగా ప్రణాళికలతో కదులుతూ కమిషనర్ ఇటీవలే కోరమండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ నగర ప్రజలకు ఉచితంగా అందించేందుకు స్వచ్ఛ సర్వేక్షన్ 2024-ఎకో వైజాగ్ పేర తయారు చేసిన 34వేల వస్త్ర సంచులను కమిషనర్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. వీటన్నిటినీ ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. వీటిలో 15వేల వరకూ జివిఎంసికి కోరమండల్ అందించింది. మిగతా 15వేలు నగరంలోని నివాసిత ప్రాంతాల్లో ప్రజలకు ఉచితంగా అందించేందుకు నిర్ణయించడం విశేషం.

జివిఎంసి పరిసరాలపైనా ప్రత్యేక దృష్టి...

విధుల్లో చేరిన వెంటనే సంపత్‌కుమార్ ఉద్యోగులు, అధికారుల పనితనంపై దృష్టిసారించారు. పరిపాలన ఎలా ఉండాలి? ప్రజలకు ఎలా అవసరాలు తీర్చాలి అన్న అంశాలపై తన విజన్‌ను ప్రకటించారు. ప్రతి ఉద్యోగి చుట్టూ ఉన్న పరిసరాల పరిశుభ్రతపై దృష్టికేంద్రీకరించాలని పిలుపునిచ్చారు. విధుల నిర్వహణలో చుట్టూ ఉన్న వాతావరణం బాగుండాలన్నారు. తగినంత గాలి, వెలుతురు, బాత్ రూమ్‌ల శుభ్రతపై డ్రైవ్ ఇచ్చారు. జివిఎంసి కార్యాలయంలో అన్ని విభాగాలను, సెల్లార్ ఫ్లోర్‌లో బ్యాటరీ కార్ పార్కింగ్ ఆవరణ, సచివాలయ కేంద్రం మొదలైన విభాగాలను ఉన్నతాధికారుల గదులను స్వయంగా పరిశీలించిన కమిషనర్ పలు అంశాలపై ఉద్యోగులు, డిపార్టుమెంట్ల హెడ్‌లకు హితబోధ చేశారు. డ్రెయినేజీ వ్యవస్థ, మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇచ్చారు.



జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్

యువత ఉపాధిపై కలెక్టర్ దృష్టి

- మార్చికి 10 వేల మందికి ఉపాధే లక్ష్యంగా ప్రణాళికలు
- ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'కలసి పనిచేద్దాం...ప్రజలకు మంచి చేద్దాం' అనే పిలుపుతో విశాఖ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జులై 7న ఎంఎన్.హరేంధిరప్రసాద్ అధికారులకు పిలుపునివ్వడం విశేషం. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు తాను ప్రాధాన్యత అధికంగా ఇస్తున్నానని, ప్రజలు, అర్జీదారులతో అధికారులు మాట్లాడి వారి సమస్యల పూర్వ పరాలను తెలుసుకోవాలంటూ కలెక్టర్ హరేంధిరప్రసాద్ డైరెక్షన్ ఇవ్వడం విశేషం. విశాఖ జిల్లాలో యువతకు సరైన ట్రైనింగ్ ఇచ్చి వారికి ఉపాధి చూపేలా పరిపాలన ఉండాలన్న లక్ష్యంతో కలెక్టర్ పనిచేస్తున్నారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం, మౌలిక వసతుల కల్పనకు సాంఘిక సంక్షేమ శాఖ, విద్యాశాఖ కలసికట్టుగా పనిచేయాల్సిన అవసరాన్ని ఆయన బాధ్యతలు తీసుకున్న తొలిరోజునే వెల్లడించారు. హాస్టళ్లలో మౌలిక వసతుల సమస్యలు కొన్ని తన దృష్టికి వచ్చినట్లు సంబంధిత అధికారులతో కలెక్టర్ స్వయంగా చర్చించి తగిన పరిష్కారానికి సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షలు సైతం నిర్వహించారు. తాగునీరు, మురుగునీటి సమస్యలు తన దృష్టికి వచ్చాయని పరిష్కరించే దిశగా అధికారులకు సూచనలు చేశారు.

వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి

వైద్య ఆరోగ్య రంగంపై తనకు గల ప్రత్యేక దృష్టిని చాటుకున్నారు. కెజిహెచ్‌లో వివిధ విభాగాలు, వార్డులను తనిఖీ చేసి సంబంధిత వైద్యులు, అధికారులతో సమావేశం నిర్వహించి ఎంఆర్ఐ, స్కానింగ్ సెంటర్ల పరిస్థితులను, రోగులకు అందాల్సిన వైద్య విషయాలపై దృష్టిసారించాలంటూ హితవు పలికారు. కెజిహెచ్‌లో జరిగిన పరిణామాలను కలెక్టర్ ఆరా తీశారు. వైద్య రంగంలో నిపుణులు, వైద్యులు, అధికారులతో ఇప్పటికే దఫ దఫాలుగా సమీక్షలు జరిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు, జాగ్రత్తలపైనా అప్రమత్తంగా ఉండాలంటూ వైద్యశాఖ ఉన్నతాధికారులకు హెచ్చరించడం విశేషం. విశాఖ పోర్టు ఫిషింగ్ హార్బర్‌లో జరుగుతున్న పలు ఆధునీకరణ పనులను ఆయన పరిశీలించారు.

మార్చి నాటికి 10వేల మందికి ఉపాధి...

వచ్చే ఏడాది మార్చిలోగా విశాఖపట్నం జిల్లాలో 10వేల మంది యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించే దిశగా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని నైపుణ్యాధికారులు, ఉపాధి కల్పనా సంస్థల అధికారులకు కలెక్టర్ పిలుపునిచ్చారు. బ్యాంకుల రుణ సహకారం, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాల ద్వారా యువతను ప్రోత్సహించే పథకాలపై దృష్టిసారించారు. ప్రతి నెలా జాబ్ క్యాలెండర్ తయారుచేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఏయే సంస్థల్లో ఉద్యోగ ఖాళీలు ఉన్నాయో వాటికి అర్హతలేమిటో స్పష్టంగా జాబ్ క్యాలెండర్‌లో నెలనెలా ఉండేలా ఆదేశాలు జారీచేశారు. వివిధ రంగాల్లో ఖాళీ పోస్టుల సమాచారం ఎప్పటికప్పుడే సేకరించే పని ఉపాధి కల్పనా కేంద్రాలు చేపట్టనున్నాయి. యువతకు స్కిల్ గైడెన్స్ ఇచ్చే బాధ్యత అధికారులకు అప్పగించడం విశేషం. పరిశ్రమల శాఖ, స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ, ఎంఎస్ఎంఇ, బ్యాంకులు, డిఆర్‌డిఎ, ఎస్సీ కార్పొరేషన్, బిసి సంస్థలు అన్నీ దీంట్లో భాగస్వామ్యం అయ్యేలా కలెక్టర్ దిశానిర్దేశం చేస్తూ పరిపాలనపై పట్టు బిగిస్తున్నారు.

వర్షాలు, వరదలకు దెబ్బతిన్న..

విద్యుత్ సరఫరా వ్యవస్థ యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ

ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృథ్వీతేజ్

ప్రజాశక్తి-సీతమ్మధార

వర్షాలు, వరదల ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్తు సరఫరా వ్యవస్థను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎమ్‌డీ పృథ్వీతేజ్ ఇమ్మడి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఇంధనశాఖ కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ త్వరితగతిన పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల సంభవించిన వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న విద్యుత్ సరఫరా వ్యవస్థ పునరుద్ధరణకు చేపట్టిన చర్యలపై సిఎండి ప్రజాశక్తితో మాట్లాడారు. అన్ని సెక్షన్ కార్యాలయాల్లో స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, అవసరమైన సామగ్రి, సిబ్బందిని అందుబాటులో ఉంచడం ద్వారా పునరుద్ధరణ చర్యలను త్వరితగతిన చేపట్టగలిగామని చెప్పారు. వర్షాల కారణంగా ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 5 సర్కిళ్లలోని 24 మండలాలు, 140 గ్రామాల్లో 47,999 సర్వీసు కనెక్షన్లకు విద్యుత్తు అంతరాయం ఏర్పడినట్లు తెలిపారు. నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను, తెగిపడిన విద్యుత్ తీగలను, పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల స్ట్రక్చర్లను యుద్ధప్రాతిపదికన సరిచేసినట్లు పేర్కొన్నారు. వినియోగదారుల నుంచి టోల్ ఫ్రీ నెంబరు 1912కు, కంట్రోల్ రూమ్ నెంబర్లకు వచ్చిన ఫిర్యాదులను కాల్ సెంటర్ సిబ్బంది ఎప్పటికప్పుడు నమోదు చేసుకుని వాటిని క్షేత్రస్థాయి సిబ్బందికి త్వరితగతిన తెలియజేయటం ద్వారా తక్కువ సమయంలో విద్యుత్తును పునరుద్ధరించగలిగామని చెప్పారు. సంస్థ పరిధిలోని 5 సర్కిళ్లలో నష్టం సంభవించగా అందులో ప్రధానంగా రాజమండ్రి, ఏలూరు సర్కిళ్లలోనే ఎక్కువ నష్టం వాటిల్లిందని తెలిపారు. కుక్కునూరు, వేలేరుపాడు, రాజీవ్ నగరం, మారేడుమిల్లిలోని 33/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్లు 4 దెబ్బతినగా వాటిని పునరుద్ధరించామని వెల్లడించారు. సంస్థ పరిధిలోని 5 సర్కిళ్లలో ఇప్పటివరకు గుర్తించిన సమాచారం మేరకు 24 మండలాలు, 140 గ్రామాల్లో 47,999 సర్వీసు కనెక్షన్లకు 47,999, 33కెవి ఫీడర్లు 17 కి 17 (శ్రీకాకుళంలో 1, విజయనగరంలో 5, విశాఖపట్నంలో 9, రాజమండ్రిలో 1, ఏలూరులో 1), 11కెవి ఫీడర్లు 68 కి 68, 33కెవి స్తంభాలు 26 కి 26, 11కెవి స్తంభాలు 355 కి 314, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు 137 కి 129, వ్యవసాయ కనెక్షన్లు 1837 కి 1351 సర్వీసులను అతి తక్కువ సమయంలో పునరుద్ధరించినట్లు వెల్లడించారు. వర్షం తగ్గిన ప్రాంతాల్లో మిగిలిన వాటిని సోమవారం నాటికి ప్రత్యేక బృందాలతో పూర్తి స్థాయిలో పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని ఎస్ఈలకు ఆదేశాలిచ్చామని సీఎండీ వివరించారు. వర్షాల ప్రభావంతో తెగిపడిన విద్యుత్ వైర్లు, పడిపోయిన విద్యుత్ స్తంభాలు, పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల పట్ల వినియోగదారులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. విద్యుత్తు అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబరు 1912కు, కంట్రోలు రూమ్ ఫోన్ నెంబర్లు - కార్పొరేట్ ఆఫీసు 94408 16373, శ్రీకాకుళం 9490612633, విజయనగరం 9490610102, విశాఖపట్నం 7382299975, రాజమండ్రి 7382299960, ఏలూరు 9440902926, సంబంధిత సెక్షన్ కార్యాలయాలకు తెలియజేసి పరిష్కారం పొందవచ్చని సీఎండీ పృథ్వీతేజ్ వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు


సిఎండి పృథ్వీతేజ్





కూనవరం మండలంలో వరదనీటిలో పడవలపై వెళ్లి విద్యుత్ పునరుద్ధరణ పనులు చేస్తున్న ఆ శాఖ అధికారులు, సిబ్బంది

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కేంద్రంపై ఒత్తిడి తేవాలి

- ఎ. అజ శర్మ
ప్రధాన కార్యదర్శి,
ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక



ఆంధ్ర రాష్ట్ర విభజన జరిగి పదేళ్ళు పూర్తయింది. నేడు మరలా మోడీ 3.0 ప్రభుత్వం కేంద్రంలో ఏర్పడింది. ఆంధ్ర రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం అందులోని అంశాలన్నీ అమలై ఉండి ఉంటే ఎపి పరిస్థితి నేడు వేరుగా ఉండి ఉండేది. వెనుకబడ్డ ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలు కూడా వెనుకబాటు నుంచి అభివృద్ధి దిశలో ముందుకు సాగి ఉండేవి. కానీ చాలా దురదృష్టకరంగా ఈ పదేళ్ళ కాలంలోనూ వెనుకబాటు నుంచి బయటపడటం కాదు సరికదా ఉత్తరాంధ్ర మరింత వెనుకబాటులోనికి నెట్టబడింది. దీనికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన చట్టాన్ని ఎలా అమలు చేయాలి అనేది చూడకుండా.., దానికి భిన్నంగా ఎలా అమలు చేయకుండా ఉండాలి అనే దారులు వెతకడమే. అలాగే ఈ పదేళ్లలో రాష్ట్రంలో ఏర్పడిన తెలుగుదేశం, వైసిపి ప్రభుత్వాలు నోరెత్తకపోవడమే.

దీనివల్లే 2022 కల్లా చట్ట ప్రకారం పూర్తి కావాల్సిన పెట్రోలియం యూనివర్సిటీ, గిరిజన యూనివర్సిటీ వంటివి నేటికీ పెండింగులోనే ఉన్నాయి. గిరిజన యూనివర్సిటీకి అయితే ఇంకా స్థలం ఎక్కడ అనే అంశమే వివాదాల్లో చిక్కుకుంది. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఈ స్థలం మార్చడంతో ఇది ఒక విశ్వవిద్యాలయం వలె కాకుండా ఒక రాజకీయ క్రీడగా మారింది.

విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ గత పదేళ్లుగా ఇదిగో ఏర్పాటు చేస్తున్నాం, అదిగో ఏర్పాటు చేస్తున్నామంటూ కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు ప్రకటనలైతే ఇస్తున్నారు తప్ప ఆచరణలో అడుగు కూడా ముందుకు పడలేదు. 2024 పార్లమెంట్ ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం స్థలం ఇవ్వలేదు కాబట్టి రైల్వే జోన్ ఏర్పాటు చేయలేదని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం దానికి సమాధానంగా ఎప్పుడో ముడసర్లోవ దగ్గర స్థలం ఇవ్వడానికి సంసిద్ధత వ్యక్తం చేశామని చెప్పింది. అప్పుడు అభ్యంతరం చెప్పకుండా నేడు తాజాగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మరో వాదన ఏమిటంటే రాష్ట్ర పభుత్వం కేటాయించిన భూమిలో నీటి నిల్వలు ఉంటాయి కాబట్టి ఆ భూమి రైల్వే జోన్ ఏర్పాటుకు సానుకూలం కాదని చావు కబురు చల్లగా చెప్పింది. ఆ మాటేదో ముందే చెప్పొచ్చు కదా! వాస్తవంగా విశాఖలో రైల్వే సంస్థ వద్ద కొన్ని ఎకరాల భూమి ఉంది. ఈ స్థలాల్లో ఎక్కడైనా రైల్వే జోన్ కావలసిన భవనాలు నిర్మాణం చేయొచ్చు. కానీ కేంద్రం ఆ పని చేయకుండా, నేరం అంతా రాష్ట్ర ప్రభుత్వం మీదకు నెట్టేసి తాను తప్పించుకోవాలని దురుద్దేశంగా వ్యవహరిస్తోంది.

రాష్ట్ర విభజన చట్టంలోని మరో అంశం విశాఖలో మెట్రో రైలు నిర్మాణం. ఇది సాధ్యం కాదని పూర్తిగా కేంద్ర ప్రభుత్వం మడత పెట్టేసింది. ఇంకా విచిత్రంగా రాష్ట్ర అభివృద్ధి అని నిరంతరం జపించే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు సాధ్యం కాదని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి సాధించుకోవాల్సింది పోయి, కేంద్ర ప్రభుత్వాన్ని కనీసం అడగడం కూడా మానేసింది.

రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ ఇచ్చి ఉండాలి. కానీ కేంద్ర ప్రభుత్వం నామమాత్రంగా ఈ పదేళ్ళలో జిల్లాకు వంద కోట్ల రూపాయలు చొప్పున ఇచ్చి చేతులు దులిపేసుకుంది. ఈ స్వల్ప నిధులతో అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందో ఏలిన వారికే తెలియాలి. వాస్తవంగా నరేంద్ర మోడీ 2014 ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలై బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ ఇచ్చి ఉంటే, ఉత్తరాంధ్రలోని నీటి ప్రాజెక్టుల నిర్మాణం, రోడ్లు, విద్యుత్తు, మంచినీరు వంటి మౌలిక వసతులు కల్పనా పూర్తయి ఉండేది. ఇవేవీ చేయకపోవడంతో గ్రామీణ పేదరికం ఈ కాలంలో కూడా భారీగా పెరిగింది. వలసలు పెరిగాయి. గిరిజన ప్రాంతంలో మౌలికవసతులు కరువయ్యాయి. ఇప్పుడు జిల్లాకు మరో 250 కోట్ల రూపాయలు



కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. దానివల్ల కూడా జరిగే అభివృద్ధి నామమాత్రమే.

నేడు కేంద్రంలో ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వానికి తెలుగుదేశం, జనసేన పార్టీల మద్దతు అవసరం కావున, ఇరు పార్టీలు మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, విభజన చట్టంలోని అంశాలన్నీ అమలు జరిగేలా చూస్తారా? లేదా? అన్నదానిపైనే రాష్ట్ర భవిష్యత్తు, ఉత్తరాంధ్ర అభివృద్ధి ఆధారపడి ఉంటాయి. అయితే ఈ పార్టీలు ఏం చేస్తాయన్నదే సందేహం. ఎందువల్లనంటే తాజా కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేకంగా ఏమీ ఇవ్వకపోయినా ఈ రెండు పార్టీలు ఏదో ఇచ్చేసినట్లు చంకలు గుద్దుకున్నాయి. చంద్రబాబు నాయుడు ప్రధానిని కలిసినప్పుడు విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని ఆపాలని కనీసంగా కూడా కోరలేదు. స్టీల్ ప్లాంటే కానీ లేకపోతే ఇక రాష్ట్రాభివృద్ధి ఎలా సాధ్యం? పవన్ కళ్యాణ్ స్టీల్ ప్లాంట్‌పై కేంద్రాన్ని ఒప్పిస్తామని చెప్పడం మాటలకే పరిమితం కాకుండా చేతలలో చూపించేలా నరేంద్ర మోడీ ప్రభుత్వంపై ఒత్తిడికి తేవాల్సిన అవసరం ఉంది.

చంద్రబాబునాయుడు 2014-19 మధ్య అమరావతి, పోలవరం పేరు చెప్పి ఐదేళ్ల మిగిలిన అంశాలను నిర్లక్ష్యం చేసినట్లు, ఇప్పుడు కూడా ఆ రెండింటి చుట్టూనే తిప్పితే ఉత్తరాంధ్ర లాంటి వెనుకబడిన ప్రాంతాల్ని గాలికి వదిలేసినట్లే. అది రాష్ట్రానికి, ఉత్తరాంధ్ర ప్రయోజనాలకు భంగకరంగానే ఉంటాయి. నేడు కేంద్రంలో ఉన్నది గతంలో వలె కాకుండా సంకీర్ణ ప్రభుత్వమనే అవకాశాన్ని వినియోగించుకుని, చంద్రబాబు తన పాలనానుభవాన్ని మేళవించి, హక్కుగా రావలసిన రాజధానికి నిధులు, పోలవరం నిర్మాణం, వెనుకబడ్డ ప్రాంతాల అభివృద్ధి, రైల్వే జోన్, మెట్రో రైలు, విద్యా సంస్థల నిర్మాణం, ప్రత్యేక హోదా, స్టీల్ ప్లాంట్ అమ్మకం ఆపి దానిని బలోపేతం చేయడం వంటన్నింటినీ కేంద్రం నుండి సాధించి రాష్ట్ర ప్రయోజనాల్ని కాపాడడానికి కృషి చేయాలి.

నగరంలో ప్రశాంత వాతావరణానికి ప్రాధాన్యం

- విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి



ప్రజాశక్తి- విశాఖపట్నం:నగరంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రధానంగా మూడు అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. గంజాయి వినియోగం, విక్రయానికి అడ్డుకట్ట వేయడం, మహిళలు, బాలికలపై దాడులు, వేధింపులు అరికట్టడం, రౌడీ షీటర్లు, ల్యాండ్ గ్రాబర్లకు ముకుతాడు వేయడం, ఈ మూడిండితో పాటు ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యేకంగా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ఇటీవల నగర పోలీస్ కమిషనర్గా బాధ్యతలు చేపట్టిన ఆయన 'నా పనితీరు ఎలా ఉంటుందో మాటల్లో కాదు.. చేతల్లో చూపిస్తాను' అని ప్రకటించారు. అన్నట్లుగానే స్వల్పకాలంలోనే తన పనితీరుతో ప్రజల మన్ననలు పొందుతూనే అవినీతి పరుల్లో గుబులు పుట్టిస్తున్నారు. సీపీగా తన ప్రాధాన్యతలు, అమలు చేయబోయే కార్యాచరణను ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

గంజాయి నియంత్రణకు కార్యాచరణ

నగరంలో గంజాయి వినియోగం, విక్రయం, ఇటీవల కాలంలో బాగా పెరిగిపోయింది. చాలా మంది యువత గంజాయి మత్తులో నేరాలకు తెగబడుతున్నారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు నగరంలో డైనమిక్ చెకింగ్స్ పేరుతో తరచూ ఏదో ఒక ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం.

మహిళలపై వేధింపులకు పాల్పడితే నగర బహిష్కరణ

నగరంలో మహిళలు, బాలికలపై అత్యాచారం, లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తాం. అవసరమైతే పీడీ యాక్టు అమలు చేయడం, లేదనుకుంటే నగర బహిష్కరణ వేటు వేస్తాం. విద్యార్థులపై వేధింపులు, ఈవ్టీజింగ్కు అడ్డుకట్ట వేసేందుకు డెకాయి బృందాలను ఏర్పాటు చేశాం.

భూ కబ్జాదారులపై ల్యాండ్ గ్రాబింగ్ షీట్

నగరంలో భూ కబ్జాలు, భూ వివాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. గతంలో భూ వివాదాలు, కబ్జాలకు సంబంధించి ఎవరైనా పోలీసులకు ఫిర్యాదు చేస్తే వాటిని సివిల్ కేసులంటూ తీసుకునేందుకు నిరాకరించేవారు. కానీ, భూ కబ్జాలకు పాల్పడే వారు ముందుగా డాక్యుమెంట్లను డూప్లికేట్ చేయడం, సంతకాలను ఫోర్జరీ చేయడం చేస్తున్నారు కాబట్టి వాటిని క్రిమినల్ కేసులుగానే గుర్తించాల్సి ఉంటుంది.

నేరాలు జరుగుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక గస్తీ

నగరంలో మహిళలపపై వేధింపులు, దాడులు జరుగుతున్న ప్రాంతాలు, గంజాయి వినియోగించే ప్రాంతాలు, అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్న ప్రాంతాలను ఇప్పటికే గుర్తించాం. అలాంటి ప్రాంతాల్లో ప్రతి పోలీస్ స్టేషన్ నుంచి దిచక్ర వాహనంపై రక్షక్ బృందాలు తిరిగేలా చర్యలు తీసుకున్నాం.

నిందితులకు శిక్ష పడేలా చర్యలు

నమోదు చేసిన అన్ని కేసుల్లోనూ నిందితులకు శిక్ష పడేలా చర్యలు ప్రారంభించాం. కోర్టులో వీగిపోయే కేసులపై ప్రతి నెలా క్రైమ్ మీటింగ్ రోజున పవర్పాయింగ్ ప్రజెంటేషన్ ద్వారా కేసు ఎందుకు వీగి పోయింనేది సమీక్షిస్తాం.

మూడు రోజుల్లోనే పాస్పోర్టు వెరిఫికేషన్ పూర్తి

నగరంలో పాస్పోర్టు వెరిఫికేషన్పై అనేక ఆరోపణలు ఉన్నాయి. వెరిఫికేషన్కు వెళ్తే డబ్బులు ఇవ్వకపోతే వెరిఫికేషన్ను పెండింగ్లో ఉంచేస్తున్నారని ఫిర్యాదులు ఉన్నాయి. అలాంటి వాటిని చెక్ పెట్టేందుకు ప్రతి కానిస్టేబుల్ ప్రతి రోజూ ఎన్ని పెండింగ్లో ఉన్నాయి. ఎన్ని పూర్తి చేశారనే దానిపై డిఎస్ఆర్ ఇవ్వాలి.

సీపీ హెల్ప్లైన్తో పోలీస్శాఖపై నమ్మకం పెరిగింది

నగరంలో ప్రజలతో పాటు సిబ్బందికి ఎవరికైనా పోలీస్ శాఖా పరంగా సహాయం కావాల్సి వచ్చినా.. నేరం జరిగితే సమాచారం అందించేందుకుగాను సీపీ హెల్ప్లైన్ పేరుతో ఫోన్ నెంబర్ 7995095799అందుబాటులో ఉటుంంది.

జివిఎంసీతో కలిసి ట్రాఫిక్ సమస్య పరిష్కారం

నగరంలో ట్రాపిక్ సమస్య ప్రధాన సమస్యగా మారింది. దీనిని అధిగమించేందుకు జివిఎంసితో కలిసి చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం.

సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత

ప్రజలకు భద్రత కల్పించడంతో పాటు పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వబోతున్నాం. ఇకపై ప్రతి నెలా రిటైర్మెంట్ మేళాతో పాటు రివార్డు మేళా ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఇకపై ఉద్యోగ విరమన చేసే వారికి వచ్చే ప్రయోజనాలను అదే రోజు అందజేయాలని నిర్ణయించాం.

ప్రత్యామ్నాయ జర్నలిజానికి ప్రతీక ప్రజాశక్తి

(మొదటి పేజీ తరువాయి..) బెంగాల్ కమిటీకి విక్రయించింది. దానిపైనే అప్పటి వరకూ బెంగాల్‌వారు గణశక్తిని సాయంకాలపు పత్రికగా ప్రచురిస్తున్నారు. ఇప్పుడు తాము కొత్త మిషన్ కొంటున్నామని, పాత మిషన్ కావాలంటే అప్పటి ధరకే అందజేస్తామన్నది వారి ప్రతిపాదన. దీనిపై సీనియర్ నాయకులు వెనువెంటనే చర్చించి ఆమోదించారు. ప్రజాశక్తి వారపత్రికను దినపత్రికగా వెలువరించాలని నిర్ణయించారు. రాష్ట్ర కమిటీ ఆ మేరకు ప్రకటన చేసింది. ఆ ప్రకారం 1981 ఆగస్టులో వారపత్రిక ప్రచురణ ఆగింది. 'వారపత్రికగా సెలవు-దినపత్రికగా మీ సేవకు సిద్ధం' అంటూ నాటి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి, ప్రజాశక్తి దినపత్రిక ప్రథమ సంపాదకులు మోటూరు హనుమంతరావు వీడ్కోలు సంపాదకీయం రాశారు. దినపత్రిక సన్నాహాలు మొదలయ్యాయి.

నిజానికి ప్రజాశక్తికి 80 ఏళ్ల చరిత్ర ఉంది. నలభయ్యవ దశకంలో అది ప్రజల పత్రికగా, శ్రమజీవుల వాణిగా పేరొందింది. భాషా సంస్కృతి తదితర అంశాల్లో కూడా ప్రజాప్రయోజనాలకు పట్టం కట్టింది. ఇది సహించలేని వాళ్లు 'పెద్ద బాలశిక్ష ఫెయిల్ - ప్రజాశక్తి పాస్' అంటూ అక్కసు వెలిబుచ్చేవారు. చదువురాని వాళ్లను కూడా చైతన్యపరిచేలా పదునైన భాషలో పత్రిక రావడమే వారి ఆగ్రహానికి కారణం. ప్రభుత్వ నిర్బంధానికి గురైన తర్వాత మళ్లీ సాధారణ పరిస్థితులు ఏర్పడి పత్రికను పునరుద్ధరించినా ఆ పేరుతోగాక విశాలాంధ్ర పేరుతో వచ్చింది. మళ్లీ రాజకీయావసరాలరీత్యా 1968 నుంచి దాదాపు పదమూడేళ్ల పాటు ప్రజాశక్తి వారపత్రికగా నడిచింది. వారపత్రిక తేవడానికి అవసరమైనంత మేరకు కంపోజింగ్, ప్రెస్ ఉన్నాయి. దినపత్రిక ప్రచురించడానికి చాలా సిబ్బంది కావాలి. యంత్రాంగమూ పెరగాలి. దీంతో మూడు నెలల ముందు సన్నాహాలు మొదలయ్యాయి. పుచ్చలపల్లి సుందరయ్య ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. మోటూరు హనుమంతరావు పత్రికా నిర్వహణ సంబంధమైన ఏర్పాట్లు చూశారు.

ప్రజాశక్తి దినపత్రికగా రాబోతుందన్న వార్త వామపక్ష ప్రగతిశీలవాదులకు ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. నాయకుల ద్వారా దాతలు సహాయ సహకారాలు అందజేశారు. పుచ్చలపల్లి సుందరయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఇఎంఎస్.నంబూద్రిపాద్ పత్రిక తొలి ప్రతిని ఆవిష్కరించారు. ఆ సందర్భంగానే సుందరయ్య.. కమ్యూనిస్టులు పత్రికను ఎంత విలువైనవిగా పరిగణిస్తారో వివరించారు. అప్పటివరకూ విశాలాంధ్ర మాత్రమే వామపక్ష దినపత్రికగా వెలువడుతుండేది. కమ్యూనిస్టు పత్రికలంటే అదే నమూనాలో ఊహించేవారు. సాధారణ వార్త ఎంత ముఖ్యమైనదైనా అంతకంటే పార్టీ సంబంధమైన వార్తకే ప్రథమ ప్రాధాన్యతనివ్వడం, ఉద్యమ సంబంధమైన నాయకుల ప్రకటనలు మొదటి పేజీలో ఇవ్వడం ఇందులో ప్రధానాంశం. అయితే ప్రజాశక్తిని కేవలం వ్యూస్ పేపరుగా కాక న్యూస్ పేపర్‌గా తీసుకురావాలని నాయకత్వం భావించింది. అంటే కేవలం పార్టీ సంబంధిత వార్తలు మాత్రమే కాకుండా అన్ని రకాలైనవి ఇవ్వాలని నిర్ణయమైంది. ఇదో కొత్త ఒరవడి. అయితే దాన్ని సంపూర్ణం గావించడానికి చాలా కాలం పట్టింది. ప్రజాశక్తి దినపత్రిక పున:ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే కారల్ మార్క్స్ జయంతి ఉత్సవాలు వచ్చాయి. ఆ పైన సిపిఎం జాతీయ మహాసభలు విజయవాడలో అపూర్వంగా జరిగాయి. ఇవన్నీ కూడా పాఠకులకు ఆసక్తికరమైన సందర్భాలు కావడంతో పత్రిక చురుగ్గా నడిచింది. ఆదివారం అనుబంధం విభిన్నంగా ఉందని అభినందనలు వచ్చాయి. పెద్ద యంత్రాంగం లేకున్నా ఉత్సాహవంతులైన యువ పాత్రికేయులే శ్రమపడి రాస్తుండేవారు.

కొత్త యంత్రం.. నూతన భవనం

అప్పటికే తెలుగు దినపత్రికల్లో కొత్త పోకడలు ఊపందుకున్నాయి. ఆంధ్రప్రభ స్థానంలో ఈనాడు అగ్రశ్రేణి దినపత్రికగా అవతరించింది. జర్నలిజంలో కొత్త ధోరణులు తీసుకొస్తున్నది. పార్టీ సంబంధమైన వార్తలను కూడా ప్రజాశక్తిని మరపించేలా ఇవ్వాలన్నది దాని వ్యూహం. ఆ విధంగా 1982లో మహాసభ సందర్భంగా నాయకుల ఇంటర్వ్యూలు వగైరాలు ఎంతో విస్తృతంగా ఇచ్చింది. వనరులు, నిపుణులు ఎక్కువ. ఇలాంటి తరుణంలో ప్రజాశక్తి పాఠకుల్లో కూడా మరింత కొత్తదనం కావాలనే ఆకాంక్ష పెరిగింది. ఈలోగా ఎన్‌టిఆర్ రంగప్రవేశం, విజయం ఇవన్నీ రాజకీయాలను, మీడియాను అమితంగా ప్రభావితం చేశాయి. ఈ నేపథ్యంలో బెంగాల్ నుంచి తెచ్చుకున్న పాతమిషన్‌పై పత్రికను ప్రచురించడం ఆచరణ సాధ్యం కాని విషయంగా మారింది. అందుకే ఆఫ్‌సెట్ యంత్రాన్ని తెప్పించాలని నిర్ణయమైంది. అప్పటివరకూ మార్క్సిస్టు కార్యాలయంలో ఒక భాగంగా తీసుకుని నడుస్తున్న ప్రజాశక్తికి నూతన భవనం కూడా అవసరమని భావించారు. అలాంటి సమయంలో ఉద్యమ శ్రేయోభిలాషి కాట్రగడ్డ శ్రీనివాసరావు.. నవరంగ్ టాకీస్ పక్కన ఉన్న విలువైన స్థలాన్ని ప్రజాశక్తికి ఇచ్చేందుకు ముందుకొచ్చారు. 1983 మే 1న, ఆ రోజు మేడే మాత్రమే కాక సుందరయ్య జన్మదినం కూడా. ఆయనకు మహాభిమాని, సన్నిహితుడు అయిన శ్రీనివాసరావు ఆ రోజునే భవనాన్ని అంకితం చేయాలని నిర్ణయించారు. సీనియర్ నాయకులైన బిటి.రణదివే వచ్చి భవన ప్రారంభోత్సవంతో పాటు ప్రధానోపన్యాసం చేశారు.

ఆఫ్‌సెట్‌లో అందంగా ముద్రించిన పత్రికను చూసి పాఠకులు ఎంతగానో మెచ్చుకున్నారు. అప్పటినుంచి సాంకేతికంగానూ పత్రికలో నూతన ప్రయోగాలు మొదలయ్యాయి. మిగిలిన వారికున్న హంగులు లేకున్నా పత్రికలోని యువ మిత్రులు ప్రయోగశీలతతో దాన్ని విభిన్నంగా తేవడానికి ఎప్పటికప్పుడు ప్రయత్నించారు. ఇతర ప్రముఖ పత్రికలవారు కూడా హర్షిస్తూ వచ్చారు. పార్టీ పత్రికే అయినా ప్రజాశక్తి భిన్నంగా ఉంటుందనే వాదన బలపడింది.

ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఊపిరి

ఇంతలో నాదెండ్ల భాస్కరరావు వెన్నుపోటుతో ఎన్‌టిఆర్ ప్రభుత్వం కూలి పోయింది. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఉద్యమం మొదలైంది. ప్రజాశక్తి ఆ ఘట్టంలో ఒక ముఖ్య (మిగతా 10లో..)

విశాఖ పోర్టుకు అంతర్జాతీయ ఖ్యాతి

పలు సూచీల్లో ముందంజ


విశాఖపట్నం పోర్టు, ఇన్‌సెట్‌లో చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

విశాఖ పోర్టు అంతర్జాతీయ యువనికపై తన ఖ్యాతిని మరోసారి ఇనుమడింపజేసుకుంది. ఇటీవలే రెండు అంతర్జాతీయ ర్యాంకులు సాధించింది. ప్రపంచ బ్యాంకు నిర్వహించిన కంటైనర్ పోర్టు పనితీరు సూచికలో 20వ స్థానంలోనూ, కంటైనర్ టెర్మినల్ పనితీరు సూచికలో 19వ స్థానంలో నిలిచి తన ప్రతిష్టను మరోమారు చాటిచెప్పింది. ఈ విజయం విశాఖపట్నం పోర్టు పనితీరును, ప్రపంచ వాణిజ్యంలో పోర్టు ప్రాముఖ్యతను తెలుపుతోందని అధికారులు వెల్లడించారు. కంటైనర్ పోర్టు పనితీరు సూచికలో తనకున్న విశేష అవకాశాలను అందిపుచ్చుకుని 2022లో ఉన్న 122వ స్థానం నుంచి ఏకంగా 102 స్థానాలు ఎగబాకి 19వ స్థానానికి విశాఖ పోర్టు చేరుకుంది. పెరిగిన ర్యాంకింగ్ స్థానికంగా, అంతర్జాతీయంగా వాణిజ్య వృద్ధిలోనూ, వ్యాపార అవకాశాలను కల్పించడంలోనూ దోహదపడుతుంది. పోర్టులో పెరిగిన పని సామర్థ్యం కారణంగా సరుకు రవాణాలో గణనీయమైన పెరుగుదలను నమోదు చేయడమే కాకుండా వ్యాపార అవకాశాలను పెంపొందించి దేశ వాణిజ్యాభివృద్ధిలో తనదైన ముద్రను వేయనుంది. ఈ ఘనతను సాధించడం పట్ల పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు స్పందిస్తూ పోర్టు సాధించిన ఘనత పట్ల గర్వంగా ఉందని తెలిపారు. సిబ్బంది అంకితభావం, కష్టించేతత్వం వల్లనే ఇవి సాధ్యమయ్యాయన్నారు. ప్రపంచ పటంలో విశాఖ పోర్టును ఉన్నతంగా నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. ఈ ఏడాది 90 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా చేయడంతో పాటు 10 లక్షల మొక్కలను నాటాలనే లక్ష్యాన్ని విధించుకున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు పెద్ద పీట వేస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో మానవ వనరులను అభివృద్ధి చేసేందుకు సెమ్స్, ఐఎంయు ద్వారా పోర్టు ఉద్యోగులకు, స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. పర్యావరణం, ఆరోగ్యం, సురక్ష విభాగంలో మంచి పనితీరు కనబరిచినందుకుగానూ 2022-23 ఏడాదికి గ్రీన్ టెక్ ఫౌండేషన్ విన్నర్ అవార్డు కోసం రికమెండ్ చేసినట్లు తెలిపారు.

ఎంవి హహైన్ నౌక రాక

న్యూ కాసిల్ మ్యాక్స్ లైన్ స్థాయికి చెందిన ఎంవి హహైన్ నౌక ఈ ఏడాది జులై 25న విశాఖపట్నం పోర్టుకు చేరుకుంది. ఈ భారీ నౌకను జనరల్ కార్గో బెర్త్‌లో ఉంచారు. గాబన్ నుంచి 1,99,900 మెట్రిక్ టన్నుల మాంగనీస్‌ను ఇది రవాణా చేస్తుంది. భారతీయ పోర్టుకు ఒక నౌక ద్వారా తీసుకొచ్చిన అతి పెద్ద సరుకు ఇదే కావడం గమనార్హం. మొత్తం సరుకులో 1,24,500 మెట్రిక్ టన్నులను విశాఖపట్నం పోర్టులో అన్‌లోడింగ్ చేశారు. ఈ నౌక 300 మీటర్ల పొడవు, 50 మీటర్ల వెడల్పు, 18.46 మీటర్ల డ్రాఫ్ట్ కలిగి ఉంది. ఈ సరుకును ప్రపంచంలోనే మాంగనీస్ ఎగుమతిలో పేరొందిన ప్రముఖ మాంగనీస్ ఎగుమతి దారుడు ఎరామెట్ ఎస్ఎ.ఫ్రాన్స్ రవాణా చేశారు. బోత్రా షిప్పింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ నౌక, సరుకు నిర్వహణ ఏజెంట్లుగా సేవలు అందిస్తోంది. విశాఖపట్నం పోర్టు, బోత్రా షిప్పింగ్ సర్వీసెస్‌కి ఈ తాజా పరిణామం ఒక ముఖ్యమైన మైలురాయి అని విశాఖ పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు తెలిపారు. తమ పోర్టు ఇటువంటి మైలురాళ్లను చేరుకోవడానికి మరింత కృషి చేయనుందన్నారు.

ఆదాయార్జనలో వాల్తేరు రైల్వే రికార్డు


రైల్వే డిఆర్ఎం సౌరభ్ ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖపట్నం

వాల్తేరు రైల్వే డివిజన్ సరికొత్త రికార్డును నెలకొల్పింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆదాయార్జన రూ.10 వేల కోట్లు దాటిందని డిఆర్ఎం సౌరభ్ ప్రసాద్ వెల్లడించారు. 2022-23 మార్చి 25వ తేదీ నాటికి రూ.9,113 కోట్ల ఆదాయం నమోదుచేయగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.10 వేల కోట్లు దాటిందని వివరించారు. డివిజన్ చరిత్రలో ఇది ఒక మైలురాయిగా పేర్కొన్నారు. వినియోగదారులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి వ్యూహాలు రూపొందించడం, వారితో కలిసి పనిచేయడం, ప్రయాణికులకు వసతులు పెంచడం, క్రూ మేనేజ్‌మెంట్ పనితీరు బాగుండడం తదితర కారణాల వల్ల ఈ ఆదాయం సాధించగలిగామని డిఆర్ఎం వివరించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, రైల్వే లైన్ల డబ్లింగ్ పనులు, భద్రతకు సంబంధించిన పనుల వల్ల సాధారణ రాకపోకలకు కొంత అంతరాయం కలిగినా ఈ వృద్ధిని సాధించడం విశేషమని ఆయన అధికారులు, సిబ్బందిని అభినందించారు.

ఏయును తీర్చిదిద్దుతాం

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు

ప్రజాశక్తి - విశాఖపట్నం: "ఐఐటీ, ఎన్ఐటీల స్థాయిలో ఏయూను తీర్చిదిద్దుతాం. నేషనల్ యూనివర్సిటీల మాదిరిగా ఏయూకు బ్రాండ్ క్రియేట్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందుకు ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేశా. ఐఐటీ, ఎన్ఐటీల్లో చదువుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు చూడగానే ఇంటర్వ్యూ, టెస్ట్ లేకుండా ఉద్యోగాలు ఇస్తున్నారు. అదేస్థాయికి వర్సిటీని తీసుకువెళతాం' అని అంటున్నారు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు. ఇన్‌చార్జి వీసీగా కొద్దిరోజుల కిందట బాధ్యతలు స్వీకరించిన ఆయన యూనివర్సిటీలో నియామకాలు, కొత్త కోర్సుల ప్రారంభం, వందేళ్ల ఉత్సవాలు సహా అనేక అంశాలపై మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..



ఏయూ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

యూనివర్సిటీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశాను. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది సహకారంతో వర్సిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళతాను. ముఖ్యంగా రాజకీయాలకు వర్సిటీని దూరంగా ఉంచడమే లక్ష్యంగా పెట్టుకున్నా. పొలిటికల్ ఫ్రీ క్యాంపస్ చేయడమే నా ముందున్న ప్రథమ కర్తవ్యం. అకడమిక్స్ క్వాలిటీని ఇంప్రూవ్ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాను. ఐఐటీ, ఎన్ఐటీ స్థాయికి వర్సిటీని తీసుకువెళతాను. గత కొన్నాళ్లుగా నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)లో వర్సిటీకి మెరుగైన ర్యాంకు రాలేదు. ఈ ర్యాంకు మెరుగుపర్చుకోవడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశా.

పరిశోధనలు పెరగాలి..

యూనివర్సిటీలో పరిశోధనలు పెరగాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ప్రోత్సహిస్తాం. ఈ మేరకు వర్సిటీలోని ప్రిన్సిపాళ్లు, డీన్లుకు ప్రత్యేక ఆదేశాలు ఇచ్చాం. ప్రిన్సిపాల్స్ కూడా తప్పనిసరిగా ఒక సబ్జెక్ట్ బోధించాలని ఆదేశాలు జారీచేశాం.

తొలిసారి పెర్‌ఫార్మెన్స్ అప్రైజల్ ఫామ్

అంతర్జాతీయంగా పేరుగాంచిన వర్సిటీల్లో పెర్‌ఫార్మెన్స్ అప్రైజల్ ఫామ్‌తో ఫ్యాకల్టీ ప్రతిభ, పరిశోధనలు, ఇతర అంశాలను అసెస్ చేస్తుంటారు. తొలిసారి ఈ విధానాన్ని వర్సిటీలో ఈ ఏడాది నుంచి ప్రవేశపెడుతున్నాం. విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పుడు వివిధ అంశాలతో కూడిన ఫామ్‌ను ఫ్యాకల్టీకి అందిస్తాం. ఇయర్ ఎండింగ్‌లో వాటిని తీసుకుంటాం. వీటిని చూడగానే సదరు ఫ్యాకల్టీకి సంబంధించిన పరిశోధన ప్రాజెక్టులు, ఇతర అంశాలపై అంచనాకు రావచ్చు.

వి సెజ్‌లో రికార్డు స్థాయి ఎగుమతులు

- గతం కంటే 18 శాతం అదనం



వి సెజ్ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీనివాస్ ముప్పాల

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ (దువ్వాడ) 2024-25 ఏప్రిల్-జూన్ మొదటి త్రైమాసికంలో రూ.62,198 కోట్ల ఎగుమతులను నమోదు చేసిందని విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీనివాస్ ముప్పాల ఒక ప్రకటనలో తెలిపారు. ఇది మునుపటి సంవత్సరం 2023-24 కంటే 18 శాతం ఎక్కువ అని పేర్కొన్నారు. అందులో సేవల ఎగుమతులు రూ.37,758 కోట్లు కాగా, సరుకుల ఎగుమతులు రూ.24,439 కోట్లుగా నమోదయ్యాయని తెలిపారు. సరుకుల ఎగుమతులు మునుపటి సంవత్సరంతో పోలిస్తే 72 శాతం పెరిగాయని .వెల్లడించారు. ఈ త్రైమాసికంలో మూడు కొత్త ఎస్ఇజెడ్ యూనిట్ ప్రతిపాదనలు, రెండు ఇఒయు ప్రతిపాదనలు ఆమోదించబడ్డాయని పేర్కొన్నారు. అంతేకాకుండా విఎస్ఇజెడ్ రూ.1, 12,276 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు 2024 మార్చి 31 నాటికి 6,18,551 మందికి ఉపాధిని కల్పించిందని తెలిపారు. మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్ - జూన్ 2024) తెలంగాణ రాష్ట్రంలో ఒక కొత్త సెజ్ యూనిట్, 2 కొత్త ఇఒయు ప్రతిపాదనలు, ఆంధ్రప్రదేశ్‌లో 2 కొత్త ఎస్ఇజెడ్ యూనిట్ ప్రతిపాదనలు ఆమోదం పొందాయని ఆయన తెలియజేశారు. కొత్తగా ఆమోదించబడిన ఎస్ఇజెడ్ ఇఒయు యూనిట్లు రూ.97.24 కోట్ల పెట్టుబడి పెట్టి 1500 మందికి ఉపాధిని కల్పిస్తాయని తెలిపారు.

పలు సంస్థల ట్రేడింగ్ కార్యక్రమాలు

విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్‌లో ట్రేడింగ్ కార్యకలాపాలను చేపట్టడానికి ఆంధ్రప్రదేశ్‌లో మినరల్స్, యుపి ప్రో ఇన్వెంటరీ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు ఆమోదం పొందగా, ప్రాసెసింగ్ కోసం.. ఎం/ఎస్.ఇన్ఫినిటి మినరల్స్ అండ్ అబ్రసివేస్ ఎల్ఎల్‌పికి రెండు కొత్త సెజ్ యూనిట్ల ప్రతిపాదనలు ఆమోదం పొందాయని తెలిపారు. అదేవిధంగా తెలంగాణలో ఒక కొత్త సెజ్ యూనిట్ జెడ్ఎఫ్ పాసివ్ సేఫ్టీ సిస్టమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఐటి సేవలను అందించేందుకు ఆమోదం లభించిందని తెలిపారు. బల్క్ డ్రగ్స్ కోసం కోసం రెండు కొత్త ఇఒయులు ఎంఎస్ గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్, రిస్టా ఫార్మా ప్రైవేట్ ఫార్మాస్యూటికల్స్ సంస్థల ప్రతిపాదనలు ఆమోదం పొందాయని తెలిపారు.

ప్రత్యామ్నాయ జర్నలిజానికి ప్రతీక ప్రజాశక్తి

(7వ పేజీ తరువాయి..) భాగస్వామి అయింది. ప్రజాస్వామ్య ఉద్యమం విజయవాడ నుంచి ప్రారంభమైన రోజునే ప్రత్యేక సంచిక విడుదల చేయడంతో ప్రతివారి చేతిలోనూ అదే కనిపించింది. అప్పటి నుంచి నెలరోజుల పాటు మోటూరు హనుమంతరావు.. ప్రతిరోజూ ఇదే విషయమై సంపాదకీయాలు రాశారు. దానికితోడు కదం తొక్కించే శీర్షికలు, నాదెండ్ల మంత్రివర్గాన్ని విస్తరించినప్పుడు 'కీలుబొమ్మ మంత్రివర్గంలో తోలుబొమ్మలు" అని పెట్టిన హెడ్డింగ్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆ నెల రోజులూ ప్రజాశక్తి.. ప్రజాస్వామ్య ఉద్యమాభిమానుల ఆదరణకు పాత్రమైంది. ఎన్‌టిఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా ప్రతిష్ఠించిన తరుణంలో అన్నిటికన్నా ముందు ప్రజాశక్తి మార్కెట్లో విడుదలై సంచలనం సృష్టించింది. అలాగే ముఖ్యమైన పరీక్షా ఫలితాలు వంటివి కూడా పోటీ పడి విడుదల చేయడానికి కృషి జరగడంతో పత్రికను సీరియస్‌గా తీసుకోవడం పెరిగింది. వివిధ ప్రాంతాల్లో ఉత్సాహవంతులైన కార్యకర్తలు విలేకరులుగా వార్తలు పంపించడంతో కవరేజ్ కూడా మెరుగైంది. ఆ రోజులలో సత్తెనపల్లి సమీపంలోని కోళ్లూరు దగ్గర ఒక పెద్ద పడవ ప్రమాదం జరిగిన వార్తను ప్రజాశక్తి ఒక్కటే ఇవ్వడం పత్రికా రంగంలో సంచలనమైంది.



ప్రత్యేకతలు - ప్రతిబంధకాలు

1984లోనే తొలిసారిగా పరిశ్రమల సంచిక, స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక సంచికలు విడుదలయ్యాయి. ఇవన్నీ పత్రికస్థాయి పెరిగేందుకు దోహదపడ్డాయి. 1984లో ఇందిరాగాంధీ హత్య జరిగినప్పుడు ప్రజాశక్తి ప్రచురించిన పెద్ద ఫొటో హిందూ తర్వాత అత్యుత్తమంగా ఉన్నట్టు ప్రశంసించారు. ఇవన్నీ ఉన్నా న్యూస్‌ప్రింట్ వ్యయం, జీతభత్యాలు వగైరాలు పెరగడంతో పత్రిక నిర్వహణ కష్టంగా మారింది. అడ్వర్‌టైజ్‌మెంట్లు చాలని స్థితి. ఆ దశలో యాజమాన్యం ఆరు పేజీల పత్రికను నాలుగు పేజీలకు తగ్గించాలని నిర్ణయించింది. ఇతర పత్రికల పోటీని తట్టుకోవడమే కష్టంగా ఉన్న తరుణంలో ఉన్న పేజీలను తగ్గించడం, పత్రికల్లో వచ్చే ప్రధాన విషయాలేవీ దెబ్బతినకుండా ఉండటం వంటి అంశాలపై ముందే తగు ప్రణాళిక తయారైంది. ఏమైనా ప్రజాశక్తి రాజకీయ నిబద్ధత, పాఠకాభిమానం దాన్ని నిలబెట్టాయి. పేజీల తగ్గింపు పత్రిక సర్క్యులేషన్‌ను తీవ్ర ప్రభావితం చేయకపోవడం ఆశ్చర్యకరమైన వాస్తవం. ఒక ప్రధాన దినపత్రిక నాలుగు పేజీలతో వెలువడి నిలదొక్కుకున్న ఉదాహరణ ఆధునిక తెలుగు జర్నలిజంలో మరి కనిపించదు. అయితే అది కోరుకున్న పరిస్థితి ఏమీ కాదు. వీలు చిక్కగానే ప్రజాశక్తి తిరిగి ఆరు పేజీలకు పెరిగింది. ఈ కాలమంతటా సాంకేతికంగానూ, సిబ్బంది దృష్ట్యాను ప్రజాశక్తి హంగులు సమకూర్చుకుంటూనే వచ్చింది. ఉన్నంతలో అదనపు ఆకర్షణలు, శీర్షికలను జతచేసింది. అన్నిటికన్నా ముఖ్యంగా రాజకీయ నైశిత్యాన్ని నిలబెట్టడంలో విశేషకృషి చేసింది. రాష్ట్రంలోని రాజకీయ సీనియర్ నాయకుల్లో ఒకరుగా, కమ్యూనిస్టు వ్యాఖ్యాతలలో అగ్రగణ్యుడుగా పేరెన్నికగన్న మోటూరు హనుమంతరావు సంపాదకీయం దానికి పెద్ద పెట్టుబడి కాగా, ఉత్సాహం, అంకితభావం గల సంపాదకవర్గం, యాజమాన్యం, సిబ్బంది దాన్ని ముందుకు నడిపే సైన్యంగా పనిచేశారు. అప్పటికే రంగంలో ఉన్న పత్రికలతో ధీటుగా అది ముందుకు సాగింది. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా వామపక్ష లౌకిక శక్తుల ఐక్యతను పెంచడం దాని ప్రధాన నినాదమైంది. అప్పట్లో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీకి మద్దతునిస్తూనే విధానపరమైన అంశాల్లో నిక్కచ్చిగా విమర్శలు చేసేది.

1984 ఎన్నికల పోరాటంలో ప్రజాశక్తి ఇచ్చిన సమాచారం, ప్రత్యేక ఫీచరింగ్ నినాదాలు వంటివి అందరినీ ఆకర్షించాయి. 1985లో కారంచేడులో దళితులపై హత్యాకాండ జరిగింది. ఆ వార్తను ముందుగా ఇచ్చిన వాటిలో ప్రజాశక్తి ఒకటి. తర్వాత కూడా ఆ వివరాలను ప్రత్యేక ప్రాధాన్యతతో ఇస్తూ వచ్చింది. 1985 మే 25న సుందరయ్య కన్నుమూశారు. పత్రిక మొదటి పేజీలో ఆయన పెద్ద ఫొటోతో రాసిన లీడ్ పాఠకులను కదిలించింది. లౌకిక పార్టీల ఆధ్వర్యంలో సాగిన ఉద్యమాలకు ఎప్పుడూ ప్రజాశక్తి వాణిలా పనిచేస్తూ వచ్చింది. దానితో పాటు పలు శీర్షికల ద్వారా రాజకీయ, సైద్ధాంతిక చైతన్యం పంచిపెట్టింది.


1988 డిసెంబర్‌లో వంగవీటి మోహనరంగా హత్యానంతరం అల్లర్లు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. సంయమనంతో సమతుల్యతతో వ్యవహరించి వాస్తవాలను వెలికితీసి ప్రచురించింది. 1987 తర్వాత రాజీవ్‌గాంధీ బోఫోర్స్ కుంభకోణం దేశాన్ని కుదిపేసింది. ఆ సమాచారాన్ని తేవడంతో ప్రజాశక్తి ప్రముఖ పాత్ర వహించింది. హిందూ సహ సంపాదకునిగా ఉన్న ఎన్.రామ్ భోఫోర్సు కుంభకోణం తాలూకా కీలక పత్రాలను తమ పత్రికలో ప్రచురించడానికి అప్పటి సంపాదకులు అంగీకరించనందున ఇతర పత్రికల ద్వారా విడుదల చేశారు. తెలుగులో ఆయన ప్రజాశక్తిని ఎంచుకున్నారు. భోఫోర్స్ వార్తల ఫీచరింగ్‌తో వచ్చిన ప్రజాశక్తి సాయంత్రం మార్కెట్లో పెద్ద సంచలనమైంది. ఆ నేపథ్యంలో 1989లో కేంద్రంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం వచ్చింది. రాష్ట్రంలోని తెలుగుదేశం ఓడిపోయి, కాంగ్రెస్ అధికారం చేపట్టడంతో ప్రజాశక్తి రాజకీయ బాధ్యత పెరిగింది. రాజకీయాంశాలతో పాటు పత్రిక ఆదాయాన్ని పెంచే అడ్వర్‌టైజ్‌మెంట్లు, ఇతర యంత్రాంగాన్ని పెంచుకోవడంపై కేంద్రీకరణ పెరిగింది.

1990 ప్రజాశక్తికి మరోమలుపు. అందులో ఒకటి కంప్యూటర్ల ప్రవేశం. మరొకటి రంగురంగుల ప్రత్యేక సంచికల ప్రారంభం. అప్పటికే వివిధ దినపత్రికలు కంప్యూటర్లను ప్రవేశపెట్టాయి. కాస్త ఆలస్యమైనా సమగ్రంగా ప్రజాశక్తి కంప్యూటరీకరణను చేపట్టింది. ఉద్యమ శ్రేయోభిలాషి కొండయ్య అందుకు దోహదపడ్డారు. 1999 మే 19 నుంచి కంప్యూటర్ మీద తేవాలనుకున్నది.. సిబ్బంది ఉత్సాహం వల్ల మే 1 నుంచే తేగలిగారు. ఇతర పత్రికలు మ్యాటర్ వరకు కంప్యూటర్‌పై చేసి, లే అవుట్, పేస్టింగ్ చేసేవి. కానీ ప్రజాశక్తి ఒకేసారి పేజీనేషన్ చేయడం విశేషం. కంప్యూటర్ వ్యవస్థను లోతుగా అధ్యయనం చేసిన సిబ్బంది, బాధ్యులు అనేక నూతన ప్రక్రియలను అన్వేషించారు. ఆ విధంగా పత్రిక కొత్త ఆకర్షణ సంతరించుకోవడానికి దోహదపడ్డారు. 1990లో గోదావరి గైడ్ పేరిట పుష్కరాల ప్రత్యేక సంచిక వచ్చింది. ప్రజాశక్తి ప్రత్యేక సంచికలు ప్రతిష్టాత్మకంగా రావడానికి అది నాంది పలికింది.

1991లో దశమ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్.రామ్ ప్రజాశక్తి సాంకేతిక పద్ధతులను చూసి ఆనందాశ్చర్యాలు వెలిబుచ్చారు. చేతి కంపోజు నుంచి ఒకేసారి పేజినేషన్‌కు వెళ్లారంటే బూర్జువా దశను దాటి సోషలిస్టు దశలోకి ప్రవేశించారన్న మాట అని చమత్కరించారు. సుందరయ్య రాజకీయాలతో పాటు సాంకేతిక అభివృద్ధి గురించి తనతో (మిగతా 13లో..)













పారిశ్రామిక నగరి.. విశాఖ





స్టీల్‌ప్లాంట్ సహా ప్రఖ్యాత ప్రభుత్వరంగ సంస్థలకు నిలయం
ప్రతిష్టాత్మక విద్యాలయాలకు వేదిక

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ.. పారిశ్రామిక నగరి. దేశంలోని ప్రధాన నగరాల్లో పేరుగాంచినది. ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత కీలకమైనది. బంగాళాఖాతం ఒడ్డునగల ఈ నగరంలో భారదేశపు నాలుగో పెద్ద ఓడరేవుగా గుర్తింపునొందిన విశాఖపట్నం పోర్టు ఉంది. దేశంలోనే అతి పురాతన, తొలి నౌకా నిర్మాణ కేంద్రం విశాఖ సొంతం. సముద్రపు ఒడ్డున గల ఏకైక స్టీల్ కర్మాగారం కూడా విశాఖ ప్రత్యేకతల్లో ఒకటి. భారతదేశపు మొట్టమొదటి ఓడ అయిన 'జల ఉష' ఇక్కడే తయారై నాటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చేతుల మీదుగా సముద్రంలోకి ప్రవేశపెట్టడం విశేషం. విశాఖ. 'ప్రభుత్వ రంగ సంస్థలకు నిలయం'. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, విశాఖపట్నం పోర్టు ట్రస్ట్, హిందుస్థాన్ షిప్‌యార్డు, సెయిల్, బిహెచ్‌పివి, కోరమండల్, హెచ్‌పిసిఎల్, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) వంటి సంస్థలు విశాఖ సొంతం. అపారమైన సహజ వనరులు, మానవ శ్రమ కలిగిన ప్రదేశంగా ఆంధ్రరాష్ట్రంలో ఈ నగరం విరాజిల్లుతోంది. అన్నింటికంటే మించి ఐటి రంగానికి బెంగళూరు, హైదరాబాద్ తర్వాత మహా అవకాశాలున్న నగర ప్రాంతం ఇది. అదీగాక, ప్రధాన రాష్ట్ర ప్రభుత్వ సంస్థలైన మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ (జివిఎంసి), విశాఖ మెట్రోపాలిటన్ రీజనల్ డెవలప్‌మెంట్ అథారిటీ (విఎంఆర్‌డిఎ) ఇక్కడ అభివృద్ధికి కేంద్రాలుగా నిలిచాయి.

ఈ పట్నాన్ని పూర్వం విజగపట్నం/వాల్తేరుగా కూడా పిలిచేవారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం 1926లో స్థాపించబడింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పురాతన విశ్వవిద్యాలయం ఇది. దేశంలోనే తొలి న్యాయ విశ్వవిద్యాలయం విశాఖపట్నంలోనే ఉంది. రాష్ట్రంలో తొలి వైద్య కళాశాల ఆంధ్ర మెడికల్ కాలేజీ కూడా ఇక్కడే ఉంది. ఇన్నోవేషన్ యూనివర్శిటీ ఏర్పాటుకు తాజాగా ప్రతిపాదన తయారైంది. ప్రతిష్టాత్మకమైన అమెరికా కార్నర్ (అమెరికా స్పేస్) దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటసారిగా విశాఖలోని ఆంధ్రా యూనివర్శిటీలో ప్రారంభమైంది. దేశంలో అహ్మదాబాద్ తర్వాత అమెరికా ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెండో కార్నర్ ఇది.


పరిశ్రమలకు ఆలవాలం

విశాఖలో 'భారత నావికాదళం తూర్పు కమాండర్ సెంటర్' ఉంది. ఇది శత్రుదుర్భేజ్యమైన నావికాదళ స్థావరం. విశాఖ అభివృద్ధికి 1930వ దశకంలోనే ఓడరేవు నిర్మాణంతో బీజాలు పడ్డాయి. 1927లో ఓడరేవు నిర్మాణాన్ని ప్రారంభించగా 1933లో పూర్తి చేశారు. ఈ ఓడరేవు వద్ద ఇనుప ఖనిజం ఎగుమతులపై ఒక ఔటర్ నౌకాశ్రయం అప్పట్లో నిర్మించారు. ఆసియా ఖండంలో అతిపెద్దదైన హార్బర్, పొడవైన కన్వేయర్ బెల్టు విశాఖ ఓడరేవులో ఉన్నాయి. దేశంలో అత్యధిక ఎగుమతులు చేసిన నౌకాశ్రయాల్లో విశాఖ పోర్టు 69.03 మిలియన్ టన్నుల సరకు రవాణాతో నాలుగో స్థానంలో నిలిచింది. సింధియా స్టీ నావిగేషన్ కో-లిమిటెడ్ 1941లో స్థాపించబడింది. ప్రస్తుతం దీన్ని హిందుస్తాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్) అని పిలుస్తున్నారు. ప్రైవేట్ రంగం ఇంత పెద్ద సంస్థను నిర్వహించలేని స్థితిలో హెచ్‌ఎస్‌ఎల్ అవతరించింది. విశాఖపట్నం అంటేనే శ్రామిక జనశక్తికి కేంద్రం. సుమారు 6 లక్షల పైచిలుకు మంది అసంఘటిత రంగ కార్మికులు పనిచేస్తున్న నగరం.

గాజువాక ప్రాంతంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగ పరిశ్రమలు కోకొల్లలుగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో లక్షల సంఖ్యలో ఉపాధి పొందుతున్న కార్మికులున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల వలన రూ.వేల కోట్లలో ఏటా జిఎస్‌డిపి విశాఖ నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం (మిగతా 12లో..)

జిసిసి అభ్యున్నతికి కృషి

- జిసిసి వైస్ ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి



ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: జిసిసి అభివృద్ధికి కృషి చేస్తానని గిరిజన సహకార సంస్థ (జిసిసి) నూతన ఉపాధ్యక్షులు, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి తెలిపారు. నూతనంగా భాధ్యతలు స్వీకరించిన ఆమె పలు విషయాలను వెల్లడించారు. ఇటీవల ఆమె జిసిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సంస్థ అమలు చేస్తున్న కార్యక్రమాలపై చర్చించారు. అరకువ్యాలీ కాఫీ, మార్కెటింగ్ ఇతర అంశాలపై ప్రస్తుతం నెలకొన్న సమస్యల్ల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, జిసిసి ప్రధాన కార్యాలయం, క్షేత్ర స్థాయి సిబ్బంది. నిబద్ధతతో పనిచేయాలని, తద్వారా సంస్థ పురోభివృద్ధి చెందుతుందని అన్నారు. గిరిజనుల జీవనోపాధుల కల్పనకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆమె కోరారు.

అసలింతకీ జిసిసి ఏం చేస్తుంది ?

అటవీ ప్రాంతంలో గిరిజనులు సేకరించిన సహజ సిద్ధమైన అటవీ ఉత్పత్తులను ప్రజల చెంతకు చేర్చేందుకు గిరిజన సహకార సంస్థ (జిసిసి) ప్రత్యేకంగా కృషి చేస్తోంది. అడవుల్లో గిరిజనులు సేకరించిన ముడి సరుకులను జిసిసి అధికారులు కొనుగోలు చేసి వాటి ద్వారా రక రకాల ఉత్పత్తులు తయారయ్యేలా చూస్తారు. ఈ ఉత్పత్తులను జిసిసి ద్వారా ఏర్పాటు చేసిన షాపుల్లో, మొబైల్ వ్యాన్లు, వారాంతపు సంతల్లో విక్రయిస్తారు. రసాయనాలు లేని ఉత్పత్తులు కావడంతో వీటిని కొనుగోలు చేసేందుకు ఎక్కవ శాతం ఆసక్తి చూపుతున్నారు. గిరిజన ఉత్పత్తులకు దేశ వ్యాప్తంగా విశేష ఆదరణ ఉంది. ప్రధానంగా అరకు వ్యాలీ కాఫీతో పాటు గిరిజన తేనె, త్రిఫల పౌడర్, ఆయిల్, గిరిజన సబ్బులకు మంచి గిరాకీ ఉంది. గిరిజన సహకార సంస్థ రంపచోడవరం డివిజన్ పరిదిలో 5 జిసిజి సొసైటీ గిరిజన ఉత్తత్తుల అమ్మకాలు ఎక్కువగా జరిగేలా అదికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అటవీ ఉత్పత్తుల విక్రయాలు ఇలా

అటవీ ప్రాంతం నుంచి గిరిపుత్రులు సేకరించిన చింతపండు, పుట్ట తేనె, నరమామిడి చెక్క, కరక్కాయలు, నల్ల జీడి గింజలు, ముసిడి గింజలు, అడవి ఉసిరి కాయలు, శీకాయలు, కుంకుడు కాయలు, వివిధ రకాల పండ్లు ఇల్లా 30 రకాల వరకూ చిన్న తరహా ఉత్పత్తులు గిరిజన సహకార సంస్థ (జిసిసి) సేకరిస్తుంది. రాష్ట్రంలో 26 గిరిజన సహకార సంస్థలు, 9 డివిజన్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి ద్వారా సేకరించిన ఉత్పత్తులకు 70 కేంద్రాల్లో నిల్వ ఉంచుతారు.

పారిశ్రామిక నగరి.. విశాఖ

(11వ పేజీ తరువాయి..) వెళుతోంది.

అడుగడుగునా కేంద్ర నిర్లక్ష్యం

విశాఖపట్నం కేంద్రంగా ఎపిలో కొత్త రైల్వే జోన్ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం 2019 ఫిబ్రవరి 27న ప్రకటన చేసింది. ఈ కొత్త రైల్వే జోన్‌ను 'దక్షిణ కోస్తా రైల్వే'గా వ్యవహరిస్తారు. 2024 వచ్చేసినా ఇంకా ఈ జోన్‌కు అతీగతీ లేదు. కేంద్ర ప్రభుత్వం ఇక్కడి రైల్వేజోన్‌పై తీవ్ర జాప్యం చేయడం కనిపిస్తోంది. విశాఖ రైల్వే జోన్ పేరుతో రైల్వేలో అత్యధిక ఆదాయం ఆర్జిస్తున్న విశాఖ కేంద్రంగా ఉన్న వాల్తేరు రైల్వే డివిజన్‌ను ఒడిశాకు తరలిస్తున్నారు.. కానీ రైల్వే జోన్ ఏర్పాటు అడుగులు మాత్రం పడటం లేదు.

వైజాగ్ స్టీల్‌ప్లాంట్

విశాఖ ఉక్కు కర్మాగారానికి 1971 జనవరి 20న శంకుస్థాపన చేయగా 1977 నుంచి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. 1982 ఫిబ్రవరి 18న సెయిల్ నుంచి విడిపోయి విశాఖ ఉక్కు.. రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్‌గా అవతరించింది. 1987 డిసెంబరు నాటికి కర్మాగారం నిర్మాణం పూర్తయింది. 1990 సెప్టెంబర్‌లో ఉత్పత్తి ప్రారంభమైంది. విశాఖ ఉక్కు కర్మాగారం నాటి కమ్యూనిస్టు సోవియట్ యూనియన్ (రష్యా) సహకారంతో నిర్మాణం చేయడం జరిగింది. దేశంలోనే మొట్టమొదటి తీర ప్రాంత ఆధారిత ఉక్కు పరిశ్రమ ఇది. దీనికి సొంత గనులను కేంద్ర ప్రభుత్వాలు ఏవీ కేటాయించడం లేదు. దీంతో బయట నుంచి రా మెటీరియల్, ఇనుము మైన్స్ (గనుల)ను వేల కోట్ల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోంది. సొంత గనులు కేటాయించని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నష్టాల పేరుతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను 100 శాతం అమ్మకానికి మార్కెట్‌లో 2021 సంవత్సరంలో పెట్టింది. దీనిపై కార్మికవర్గం, స్టీల్ ఉద్యోగులు, తెలుగు ప్రజలు, విశాఖ వాసులు తీవ్రస్థాయిలో నాటి నుంచి ఆందోళన బాట పట్టారు. ఉక్కు పరిరక్షణ ఉద్యమం నేటికీ అకుంఠిత దీక్షతో సాగుతోంది.

పలు ప్రాజెక్టులతో విఎంఆర్‌డిఎ అడుగులు





కమిషనర్ విశ్వనాథన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డవలప్‌మెంట్ అథారిటీ (విఎంఆర్‌డిఎ) తలపెట్టిన ప్రాజెక్టులు ముందుకుసాగుతున్నాయి. 2018 సెప్టెంబర్ 5న విశాఖపట్నం నగరాభివృద్ధి సంస్థ (వుడా) రద్దు కాబడి ఆ స్థానంలో వచ్చిన విఎంఆర్‌డిఎ విస్తృతినీ పెంచుకుంది. ఆ సంస్థ 7,328.86 కిలోమీటర్లు విస్తీర్ణంలో ఉన్న విశాఖపట్నం మెట్రోపాలిటన్ ప్రాంతాన్ని నిర్వహిస్తుంది. విశాఖపట్నం, విజయనగరం జిల్లాలోని 50 మండలాలు, 1340 గ్రామాల ప్రాంతాలను అభివృద్ధి చేయడమే విఎంఆర్‌డిఎ లక్ష్యం. ఇది మున్సిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, స్థానిక సంస్థల అధికారుల అభివృద్ధి కార్యకలాపాలను సమన్వయం చేస్తుంది. అనకాపల్లి జిల్లా కూడా దీని పరిధిలోకి వస్తుంది. విఎంఆర్‌డిఎ కమిషనర్‌గా ఇటీవలే విశ్వనాథన్ బాధ్యతలు చేపట్టారు.

పలు ప్రాజెక్టులు

– విజయనగరం జిల్లాలోని కెఎ.పేట వుడా లే అవుట్ మీదుగా ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుంచి బాలానగర్ జంక్షన్ వరకు ప్రస్తుతం ఉన్న రహదారి విస్తరణతో పాటు మరో 1.3 కిలోమీటర్ల బిటి రోడ్ నిర్మాణం, దానిని 80 అడుగుల వెడల్పుకు విస్తరించడం కోసం 3.22 కోట్లతో నిర్మాణ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి.

– అనకాపల్లి జిల్లాలో విజయవాడ, విశాఖపట్నం రహదారిని మరో 1.96 కిలోమీటర్లు పెంచేందుకు 1.90 కోట్లతో ప్రక్రియ కొనసాగుతోంది.

– ఎండాడ వద్ద లా కళాశాల నుంచి 3.10 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులు కోట్ల రూపాయలతో జరుగుతున్నాయి.

– సబ్బవరం నుంచి కోటార్ గేట్ వరకు ప్రస్తుతం ఉన్న రహదారిని అభివృద్ధి చేయటంతో పాటు 3.75 కిలోమీటర్ల మేర 7.5 మీటర్ల డబుల్ రోడ్డు నిర్మాణానికి 9.70 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

– యలమంచిలి ఏరియాలోని డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహం నుంచి సౌభాగ్య అపార్ట్‌మెంట్ మీదుగా రైల్వే స్టేషన్ వరకు 3.52 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు సాగుతున్నాయి.

– సిరిపురం జంక్షన్ వద్ద 1.7 ఎకరాల్లో 11 అంతస్తుల్లో నిర్మిస్తున్న మల్టీ లెవెల్ కారు పార్కింగ్ అండ్ కమర్షియల్ కాంప్లెక్స్ పనులకు రూ.8 కోట్లు కేటాయించారు దీని నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

– ఎన్ఎడి జంక్షన్ వద్ద రూ.28 లక్షలతో పలు పనులు కొనసాగుతున్నాయి.

– 19700 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏండాడ – చీమలాపల్లిల్లోని ప్రాంతాల్లో కన్వెన్షన్ సెంటర్ నిర్మాణంలో ఉంది.

– కాపులుప్పాడలో నేచురల్ హిస్టరీ పార్క్ అండ్ మ్యూజియం–పరిశోధన సంస్థ నిర్మాణం రూ.88.00 కోట్లతో జరుగుతోంది.

ప్రత్యామ్నాయ జర్నలిజానికి ప్రతీక ప్రజాశక్తి

(10వ పేజీ తరువాయి..) తరచూ చర్చించేవారని, ప్రజాశక్తిని చూస్తుంటే ఆయన కలలు నిజమైనట్లు అనిపిస్తోందని రామ్ కరతాళధ్వనుల మధ్య అన్నారు. పదో వార్షికోత్సవానికి సోదర పత్రికల సంపాదకులందరూ హాజరై అభినందించారు. దశమ వార్షికోత్సవం వాస్తవానికి రాజకీయంగా, పత్రికాపరంగా కొత్త దశకు సూచన. తర్వాతకాలంలో పత్రిక అభివృద్ధి వేగం పుంజుకుంది. 1991లో సోవియట్ విచ్ఛిన్నం, 1992లో బాబ్రీ మసీదు విధ్వంసం వంటి సందర్భాల్లో ప్రజాశక్తి నిర్వహించిన పాత్ర దాన్ని ప్రగతిశీల లౌకిక శక్తులకు మరింత దగ్గర చేసింది.

మరిన్ని ఎడిషన్లు

1994లో హైదరాబాదు ఎడిషన్ ప్రారంభమైంది. ఆ ప్రతిపాదనకు మొదట చాలా మంది భయపడ్డారు. కానీ అధునాతన సాంకేతిక సదుపాయాలతో సులభంగానే ఎడిషన్ ప్రారంభమైంది. ఇది తెలుగులో వామపక్ష పత్రికల చరిత్రలో కొత్త అధ్యాయం. తర్వాత కాలంలో ప్రత్యేక సంచికలు మరింత ఎక్కువగా వచ్చాయి. పత్రిక ఎనిమిది పేజీలైంది. శీర్షికలు పెరిగాయి. కంప్యూటర్ కేంద్రాలు పెరిగాయి. 1997లో విశాఖపట్నంలో మూడో ఎడిషన్ మొదలైంది. 1999లో పత్రిక కేంద్ర కార్యాలయం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు మారింది.

కొత్త పుంతలు

2000లో నాటి చంద్రబాబు ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంతో ప్రపంచీకరణ వ్యతిరేక పోరాటాలతో ప్రజాశక్తి పూర్తిగా మమేకమైంది. పత్రికలో శీర్షికలు పెరుగుదలే కాక మరింత జనరంజకంగా మారాయి. యంత్రాంగం విస్తరించింది. చిరకాలంగా ఉన్న లోగో సహా అనేక మార్పులు జరిగాయి. 2001లో 20వ వార్షికోత్సవంలో తిరుపతి ఎడిషన్ మొదలైంది. ఇక ఆ తర్వాత చకచకా ఎడిషన్లు పెరిగాయి. ఖమ్మం, కర్నూలు, రాజమండ్రి, కరీంనగర్, ఒంగోలు, రాష్ట్ర విభజన అనంతరం శ్రీకాకుళం, అనంతపురం ఎడిషన్లు వచ్చాయి. 2004 నుంచి జిల్లాల టాబ్లాయిడ్స్ కూడా మొదలయ్యాయి. సిబ్బంది పెరిగారు. పెరిగిన యంత్రాంగం, పునాది, మారిన దృక్పథం ఇవన్నీ ప్రజాశక్తిని తెలుగు పత్రికా లోకంలో ఒక విలక్షణ ప్రగతిశీల పత్రికను చేశాయి.

మహనీయుడు మోటూరు

సంపాదకునిగా, రాజకీయ నేతగా మంచి గుర్తింపు


మోటూరు హనుమంతరావు

ప్రజాశక్తి-విశాఖపట్నం

ఓ దినపత్రిక అభివృద్ధిలో సంపాదకుని పాత్ర అత్యంత కీలకం. ఓ రకంగా చెప్పాలంటే పత్రిక నడవడికలో ఆయనే కెప్టెన్. ఇంతటి బాధ్యతను గొప్పగా నిర్వర్తించేవారు కొందరే ఉంటారు. అలాంటి వారిలో మోటూరు హనుమంతరావు ఒకరు. ఇతర పాత్రికేయుల మాదిరిగా కాక, అసాధారణమైన రాజకీయ సంపాదకునిగా కీర్తి ప్రతిష్టలను సంపాదించుకున్న వ్యక్తి మోటూరు హనుమంతరావు. అను కోకుండా.. ఆశించకుండా పత్రికా రంగంలోకి ఆయన ప్రవేశించాల్సి వచ్చింది. గుంటూరు జిల్లా కమ్యూనిస్టు పార్టీ నిర్మాతల్లో ఒకరిగానూ, రాష్ట్ర కమిటీ నాయకుల్లో ఒకరిగానూ ఉన్న హనుమంతరావు 1952 జనరల్ ఎన్నికల్లో మంత్రి కల్లూరి చంద్రమౌళిని ఓడించి మద్రాసు శాసనసభకు ఎన్నికయ్యారు. అప్పటి వరకూ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా ఉన్న చండ్ర రాజేశ్వరరావు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యునిగా ఎన్నికై ఢిల్లీలో ఉండాల్సి రావడంతో ఆయన స్థానంలో విశాలాంధ్ర పత్రికా సంపాదకునిగా ఉన్న సీనియర్ నాయకులు మద్దుకూరి చంద్రశేఖరరావును రాష్ట్ర మహాసభ రాష్ట్ర కమిటీకి కార్యదర్శిగా నియమించడంతో పత్రికా సంపాదక బాధ్యతలను అవసరం రీత్యా కమ్యూనిస్టు పార్టీ హనుమంతరావును నియమించాల్సి వచ్చింది. ఆ విధంగా విశాలాంధ్ర పత్రికకు హనుమంతరావు ఎనిమిదేండ్లు సంపాదకునిగా ఉన్నారు.

కమ్యూనిస్టు పార్టీ రెండుగా చీలి మార్క్సిస్టు పార్టీ వేరుగా ఏర్పాటైన తర్వాత మార్క్సిస్టు పార్టీ తరుపున వెలువడిన ప్రజాశక్తి పత్రికకు ఆయన పరోక్షంగానూ, ప్రత్యక్షంగానూ సంపాదకత్వ బాధ్యతలను చేపట్టారు. పార్టీలో తనకున్న రాష్ట్ర కమిటీ బాధ్యతలతో ముందుకొచ్చే అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుండేవారు. మరో వైపు 12 సంవత్సరాలకుపైగా రాష్ట్ర శాసనమండలి, రాజ్యసభ సభ్యునిగా పార్లమెంటరీ వ్యవహారాలలో నిమగ్న మౌతూనే సంపాదకత్వ బాధ్యతలను నిర్వహించడం ఒక బహుముఖ ప్రజ్ఞాశాలికి మాత్రమే సాధ్యం.

రాష్ట్రంలో మార్క్సిస్టు పార్టీకి నాయకత్వం వహిస్తూనే మరో వైపున పార్లమెంటులో తన విద్యుక్త ధర్మాన్ని నిర్వహించుతూనే పార్టీలోను, బయటా, రాజకీయ, సామాజిక రంగాల్లో పొడచూపే పెడధోరణులను ఎండగట్టేవారు. వీలైనప్పుడల్లా సంపాదకీయాలు, తీరుతెన్నులు, విమర్శలు, వ్యాఖ్యలు, కంచుకాగడా, పలుకులు, ములుకులు, చెడు-మేలు వంటి శీర్షికల ద్వారా ఆయన చేసిన రచనలు అత్యంత పదునుగాను, వ్యంగ్యంగాను సాగి పాఠకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

రహస్య జీవితం, జైలు జీవితాన్ని అనుభవిస్తున్న కాలంలో సైతం అప్పుడప్పుడు ఆయన రచనలు పత్రికకు అందుతూనే ఉండేవి. అదే కాలంలో ఆయన వివిధ సమస్యలపై 30కిపైగా గ్రంథాలను రచించారు. ఇలా బహుముఖ కర్తవ్యాలను నిర్వహించ గలగడం అసాధారణ విషయం. మన దేశంలో పత్రికా సంపాదకులుగా ఉన్నవారెవరూ ఆయనలాగా నిత్య క్రియాశీల రాజకీయాల్లో పాల్గొన్న వారు లేరంటే అతిశయోక్తి కాదు. అందుకే ఆయన సవ్యసాచి అన్న బిరుదును సంపాదించుకున్నారు. ఆ కారణంగానే ఆయన 'అసాధారణమైన రాజకీయ సంపాదకుడు'గా కీర్తి ప్రతిష్టలను పొందగలిగారు.

ప్రజల ఆదరాభిమానాలతో ముందుకు...

- తక్కువ ధరకే వాహనాలు
- ఫౌండేషన్‌తో సేవా కార్యక్రమాలు
-పద్మపూజిత వీల్స్ మార్ట్ అధినేత బసవరాజు

ప్రజాశక్తి-సీతమ్మధార

ప్రజల ఆదరాభిమానాలతో ముందుకు సాగుతున్నామని పద్మ పూజిత వీల్స్ మార్ట్ అధినేత బసవరాజు తెలిపారు. వినియోగదారులకు తాము అందిస్తున్న సేవలను ఆయన 'ప్రజాశక్తి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

'ప్రస్తుతం సగటు మనిషికి ద్విచక్ర వాహనం ఎంతో అవసరం పడుతోంది. అటువంటి వారి కోసం తక్కువ ధరతో నాణ్యమైన వాహనాలను పద్మ పూజిత వీల్స్ మార్ట్ సంస్థ అందిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఆటో ఫైనాన్స్‌తో వాహనాలను అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతోంది. ద్విచక్ర వాహనాలను అందించడంలో అగ్రగామిగా నిలిచిన సంస్థ. ప్రస్తుతం ఫోర్ వీలర్స్‌ను కూడా ప్రజలకు అందిస్తోంది. సంస్థ ఇటీవల ఆటోనగర్‌లో కార్ల కోసం వీల్స్ మార్ట్ షోరూమ్ ప్రారంభించింది. ప్రజల ఆదరణ, సంస్థ సిబ్బంది కృషితో సంస్థ దూసుకుపోతుంది.



సిద్ధంగా ఉన్న వాహనాలు

వీల్స్ మార్ట్ పద్మ పూజిత ఆటో ఫైనాన్స్ ద్వారా వచ్చే లాభంలో సంస్థ సిబ్బంది పిల్లల చదువుకు, ఇతర సేవా కార్యక్రమాలకు 40 శాతం ఖర్చు చేస్తోంది. ఏటా పిల్లల స్కాలర్‌షిప్ కింద సుమారు రూ.10 లక్షలు ఖర్చు చేస్తోంది. ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తోంది. కరోనా కాలంలో సంస్థ సిబ్బందికి నిత్యావసర వస్తువులను, వారికి అవసరమైన సహకారం అందించింది. సంస్థలో సుమారు 2500 మంది వరకు ఉపాధి పొందుతున్నారు. ఇటీవల దొండపర్తిలో నూతన షో రూమ్ ద్వారా సంస్థలో వాహనాలు కొనుగోలు చేసిన ప్రతిఒక్కరూ లబ్ధిపొందేలా ప్రయత్ని స్తున్నారు. ఏటా దసరా, సంక్రాంతికి వీల్స్‌మార్ట్‌లో బండి కొనుగోలు చేసిన వారికి బహుమతులను అందజేస్తున్నారు.



సిబ్బంది పిల్లలకు అండగా..

పద్మ పూజిత వీల్స్ మార్ట్, ఆటో ఫైనాన్స్‌లో పనిచేస్తున్న సిబ్బంది పిల్లలకు ఏటా స్కాలర్‌షిప్ అందిస్తున్నాం. సంస్థను ప్రారంభించి రెండు దశాబ్దాలు గడిచింది. అయినా ప్రజల ఆదరణ మరువలేనిది. సంస్థ అభివృద్ధిలో ప్రజలకు ఏదో విధంగా లబ్ధి చేకూరేలా ఏటా పలు రూపాల్లో బహుమతులు అందిస్తున్నాం. పద్మ పూజిత ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నాం. సంక్రాంతికి వెహికల్ కొనుగోలు చేసే ప్రతి ఒక్కరికీ బహుమతి ఇస్తున్నాం.



బసవరాజు,
పద్మపూజిత వీల్స్ మార్ట్ అధినేత


శ్రీకరం
శుభకరం
ఆషాడం నుండి శ్రావణాన్ని స్వాగతిస్తూ
ఎం.వి. ఎస్. సమర్పిస్తున్న
శ్రావణానికి
శ్రీకారం
కలెక్షన్స్ & ఆఫర్స్
అతి తక్కువ తరుగు
అత్యుత్తమ శ్రేణి ఆభరణాలు
బంగారు ఆభరణాల తరుగుపై
35%* తగ్గింపు
వెండి వస్తువులపై
₹10,000* కేజీకి తగ్గింపు
*షరతులు వర్తిస్తాయి
MVS JEWEL PARK®
MANCHUKONDA'S SINCE 1890
INDIA • USA
9-1-257, Suraj Towers Ramatalkies Road,
Visakhapatnam. Ph: 2509591/92/93
We accept all Major Cards
: 91771 01242
visit us at : www.mvsjewelpark.com // Mail : mvsjewelpark@gmail.com
BIS 916 HALLMARKED JEWELLERY
SHINEDOVE* GOLD ON EMI
Scan here
to locate our store
mvsjewelpark
MVS VARNA
92.5 SILVER JEWELLERY
MVS SILVER PARK
MANCHUKONDA'S SINCE 1890
Sampath Vinayaka Temple Road,
Opp: Vemana Mandiram, Visakhapatnam-03.
Ph: +91 93819 12243 +91 89193 25400
mvsvarna